

అవనిపై హరివిల్లు

- అద్దంకిలో ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు
- నాలుగు జిల్లాలకు చెందిన 101 మంది హాజరు
- ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీలకు అనూహ్య స్పందన


ప్రథమ బహుమతి పొందిన ముగ్గుతో విజేత బోయ ఉమాదేవి


ద్వితీయ బహుమతి పొందిన ముగ్గుతో విజేత ప్రత్యూష


తృతీయ బహుమతి పొందిన ముగ్గుతో విజేత మాధవి

అద్దంకి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): అద్దంకిలో సంక్రాంతికి ముందే పండుగ వాతావరణం నెలకొంది. స్థానిక మార్కెట్ యార్డు ఆవరణ సప్తవర్ణ శోభితమైంది. ఆకాశంలో చుక్కలను మహిళలు నేలకు దించడంతో ప్రాంగణమంతా ముత్యాల ముగ్గులతో మెరిసిపోయింది. ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు... గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్టువారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా(ట్రెండీ మహిళల ఇన్నర్ వేర్)తో పాటు... రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన పోటీలకు విశేష స్పందన లభించింది. బాపట్ల, ప్రకాశం, గుంటూరు, పల్నాడు జిల్లాల నుంచి 101 మంది మహిళలు పాల్గొన్నారు. మంచును సైతం లెక్క చేయకుండా వందల కిలోమీటర్ల దూరం నుంచి మహిళలు ఉదయం 9 గంటలకే అద్దంకి చేరుకున్నారు. ముగ్గులను తిలకించేందుకు పట్టణానికి చెందిన వారు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వివిధ కళాశాలల విద్యార్థులు కూడా ఉత్సాహంగా పాల్గొని రంగవల్లులపై మక్కువ చూపారు. గుంటూరుకు చెందిన బోయ ఉమాదేవి ప్రథమ బహుమతి పొందగా రూ.10 వేలు, మేదరమెట్లకు చెందిన ఎం.ప్రత్యూష ద్వితీయ బహుమతి పొందగా రూ.6 వేలు, చీరాలకు చెందిన ఎం.మాధవి తృతీయ బహుమతి పొందగా రూ.4 వేలను నిర్వాహకులు అందజేశారు. విజయశాంతి (కడవకుదురు), మణిమంజరి (ఇంకొల్లు), విజయలక్ష్మి (ఒంగోలు), సునీత (సత్తెనపల్లి), విద్యార్థినులు సుప్రియ (మేదరమెట్ల), లాస్యప్రియ(పోలవరం), హేమ(శంకరాపురం), అకీలా(జాగర్లమూడివారిపాలెం)కు ప్రోత్సాహక బహుమతులు అందుకున్నారు. పోటీలో పాల్గొన్న ప్రతి మహిళకు ప్రత్యేకంగా గిఫ్టులు అందజేశారు. రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ అద్దంకి తరఫున డాక్టర్ ఫణీంద్రబాబు, రావూరి రంగయ్య, సంకా సుబ్రహ్మణ్యం(బాబు), పువ్వాడ రామకోటేశ్వరావులు స్పాన్సర్లుగా వ్యవహరించారు.



ఇప్పటికి 16 సార్లు

ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీలో ఇప్పటికి 16 సార్లు పాల్గొన్నాను. ప్రథమ స్థానం రావడం ఎంతో ఆనందంగా ఉంది. తెలుగు ప్రజల సంస్కృతిని కాపాడుతూ 'ఆంధ్రజ్యోతి' ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయం.

- బోయ ఉమాదేవి



ఆనందాన్ని కలిగించాయి

ముగ్గుల పోటీలు ఎంతో ఆనందాన్ని కలిగించాయి. మహిళలలో పోటీతత్వం పెంచేందుకు ఈ పోటీలు ఎంతగానో దోహదపడుతున్నాయి. సంక్రాంతి పండుగ ముందే వచ్చినట్లు ఉంది.

- ఎం.ప్రత్యూష



ఆంధ్రజ్యోతికి అభినందనలు

మహిళలను ప్రోత్సహించే విధంగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముగ్గుల పోటీల నిర్వహించడం అభినందనీయం. ముగ్గులు తెలుగుదనం ఉట్టిపడేలా ఉన్నాయి. బహుమతి పొందడం ఎంతో ఆనందంగా ఉంది.

- ఎం.మాధవి

ఇంకెన్నాళ్లు.. రేషన్ డోర్ డెలివరీ

- ఎండీయూలతో కార్డుదారులకు కష్టాలు
- ప్రభుత్వం మారినా తప్పని తిప్పలు
- నామమాత్రపు పంపిణీతో సగం మందికి డుమ్మా
- డీలర్లు, ఎండీయూల కుమ్మక్కుతో నష్టపోతున్న లబ్ధిదారులు


గుంటూరు పట్టాభిపురంలో ఎండీయూ వాహనం వద్ద కార్డుదారుల క్యూ

గుంటూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకులు డోర్ డెలివరీ పేరుతో గత వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన ఎండీయూ వాహనాల కష్టాలు కార్డుదారులకు ఇప్పట్లో తొలగేలా లేవు. గతంలో సమీపం లో ఉన్న రేషన్ షాపులకు వెళ్లి నెలవారీ రేషన్ తెచ్చుకునే లబ్ధిదారులు ఇప్పుడు మొబైల్ డిస్పెన్సివ్ యూనిట్(ఎండీ యూ) వాహనం ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూడాల్సివస్తోంది. ఆ వాహనం వచ్చే సమయానికి కార్డుదారులు లేకపోతే ఆ నెల రేషన్ అంతే సంగతులు. ఒక వేళ వాహనం వచ్చినా, దాన్ని వీధి చివరన ఎక్కడో నిలుపుతారు. అక్కడికి వెళ్లి ఎండలో నించుని సరుకులు తెచ్చుకోవాలి. దీంతో వృద్ధులు, మహిళలు క్యూల్లో ఉండలేక అవస్థలు పడు తుండేవారు. ఇది జిల్లా కేంద్రం, మున్సిపల్ పట్టణం. గ్రామం అన్న తేడా లేకుండా ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి. గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకం అని ప్రచారం చేసుకుంటు న్న రేషన్ డోర్ డెలివరీ లబ్ధిదారులకు చుక్కలు చూపిస్తోంది. అర్థరహితమైన ఈ విధానం తో రేషన్ సరుకుల డోర్ డెలివరీ కార్డుదారులకు 'పరేషాన్'గా మారింది. ఎండీయూ వాహనదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండడంతో లబ్ధిదారులు నానా ఇబ్బందులు పడాల్సివస్తోంది. పాత పద్ధతి కన్నా కొత్త విధానంలో పడరాని పాట్లు పడాల్సి వస్తోంది. వాహనం ఎక్కడకి వచ్చి ఆగితే అక్కడికే వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కార్డుదారులకు అగచాట్లు

రేషన్ డోర్ డెలివరీ విధానంతో చిరు ఉద్యోగులు, కష్టజీవులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ విధానం కారణంగా నెలవారీ రేషన్ కూడా పొందలేని పరిస్థితి వచ్చిపడింది. గత వైసీపీ ప్రభుత్వం చెప్పినట్లు ఇంటింటికీ బియ్యం సరఫరా చేయకపోగా, వీధి చివరన వాహనం నిలిపి అందరినీ అక్కడికి పిలిచి గంటల తరబడి నిలబెట్టడం లబ్ధిదారులకు అదనపు సమస్యగా మారింది. గతంలో సమీపంలో ఉన్న రేషన్ షాపుకు ఎప్పుడు వీలైతే అప్పుడు వెళ్లి బియ్యం తెచ్చుకునే వీలుండేది. ఇప్పుడు రేషన్ సరఫరా వాహనం ఎప్పుడు వస్తుందా అని ఒకటో తేదీ నుంచి ఎదురు చూడాల్సి వస్తోంది. వాహనం వచ్చే సమయానికి లేకపోతే రేషన్ కోల్పోవాల్సి వస్తుంది. దీంతో వాహనం వచ్చేవరకూ పనులు మానుకుని ఎదురు చూడాల్సి వస్తోంది. ఇలా ప్రతి నెలా పనులు మానుకుని రేషన్ కోసం పనికి, ఉద్యోగానికి వెళ్లకుండా పడిగాపులు పడాల్సి వస్తోంది. దీనివల్ల కష్టజీవులు, కార్మికులు, రైతు కూలీలు, ప్రైవేటు ఉద్యోగులు రోజులకు రోజులు పనులు మానుకుని ఎదురు చూడాల్సి వస్తోంది. ప్రభుత్వం ఇచ్చే నామమాత్రపు సరుకుల కోసం ఉపాధి కోల్పోవాల్సి వస్తోంది. పోనీ.. రేషన్ వదిలేసుకుని పనికి వెళదామా అంటే కార్డు రద్దు చేస్తారేమోనన్న భయం వారిని వెంటాడుతోంది. ఒకవేళ ఇళ్ల వద్ద రేషన్ వాహనం కోసం ఉన్నా బియ్యం తప్పించి ఏమీ ఇవ్వడంలేదు. గతంలో బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలు ఉంటే రేషన్‌లో సబ్సిడీతో కందిపప్పు, నూనెలు తదితరాలను సరఫరా చేసే వారు. కానీ వైసీపీ ప్రభుత్వ (మిగతా 8వ పేజీలో)

ప్రకటనలోనే.. రద్దు

ఎండీయూ విధానంపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుండటంతో వాటిని రద్దు చేస్తామని కూటమి ప్రభు త్వం హామీ ఇచ్చింది. స్వయంగా రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పాత విధానాన్నే అమ ల్లోకి తీసుకువస్తాం.. కార్డుదారుల కష్టాలు తొలగిస్తాం.. అని ప్రకటించారు. అయితే నెలలు గడుస్తున్నా ఆయన మాటలు ప్రకటనలకే పరిమితమైపోయాయి. కార్డుదారు ల కష్టాలు యధాతథంగా కొనసాగుతున్నాయి. ఎండీ యూ విధానంలో లబ్ధిదారులకు రేషన్ ఎగవేతకు అవకాశం పెరగడం.. బియ్యం మాఫియా హవాతో వాహన దారులు చెలరేగిపోతున్నారు.

గత విధానమే మేలంటున్న లబ్ధిదారులు

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో 17,01,948 రేషన్ కార్డులు ఉన్నాయి. వీటి ద్వారా 45లక్షల మంది రేషన్ పొందుతున్నారు. అందుకోసం 3,200 రేషన్ డిపోలు ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వం తీసుకు వచ్చిన విధానం కారణంగా నెలవారీ రేషన్ నష్టపోవాల్సి వస్తోంది. పాత విధానంలో పదిరోజులపాటు సమీపంలోని రేషన్ షాపుల్లో రేషన్ ఇచ్చేవారు. వీలైన సమయంలో లబ్ధిదారులు అక్కడికి వెళ్లి రేషన్ తెచ్చుకునేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకూ రేషన్ సరఫరా చేయాలని పౌర సరఫరాల అధికారులు చెబుతున్నా ఎండీయూ వాహనదారులు, డీలర్ల కుమ్మక్కుతో లబ్ధిదారులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీంతో పాత విధానంలోనే రేషన్ సరుకులు కావాలన్న డిమాండ్ బలంగా వినిపిస్తోంది.

ఆకట్టుకున్న విద్యావైజ్ఞానిక ప్రదర్శనలు

- విద్యార్థులకు ఎమ్మెల్యే వేగేశన అభినందనలు


రాష్ట్రస్థాయి సైన్స్‌ఫెయిర్‌కు ఎంపికైన వర్కింగ్ మోడల్‌తో నరసాయపాలెం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థిని, గైడ్‌టీచర్‌లు

బాపట్ల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. జిల్లాలోని 25 మండలాల నుంచి 75 పాఠశాలలకు సంబంధించిన 75 మోడల్స్ ప్రదర్శనలో ఉంచారు. ప్రదర్శనను ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ప్రారంభించి విద్యార్థులను అభినందించారు. వివిధ అంశాలపై విద్యార్థులు, ఉపాధ్యాయులు పోటాపోటీగా ప్రాజెక్టులు ఏర్పాటు చేయగా అవి పలువుర్ని ఆకట్టుకున్నాయి. ఈ ప్రదర్శనలో వ్యక్తిగత విభాగంలో నరసాయపాలెంలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థిని డి.ప్రత్యూష, గైడ్ టీచర్లు ఎం.మౌనిక, కె.స్వరూప ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్మార్ట్ అండ్ అగ్రికల్చర్ ప్రాజెక్టుకు ప్రథమ, అద్దంకిలోని ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థిని ఎం.లావణ్య ప్రదర్శించిన ట్రిగ్నోమెట్రిక్‌పార్క్ ప్రదర్శనకు ద్వితీయ బహుమతులు లభించాయి. గ్రూప్ విభాగంలో సంతమాగులూరు మండలం మక్కెనవారిపాలెం జడ్పీ హైస్కూల్ విద్యార్థులు సి.హెచ్.సాయిరాందీరజ్, కుంచాల వెంకటేష్‌లు, గైడ్ టీచర్ కొల్లి మోహనాంజలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మల్టీపర్పస్ అగ్రికల్చర్‌మిషన్‌కు ప్రథమ, చెరుకుపల్లి వినయాశ్రమం రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు ఎన్.మౌనిక, షేక్.అక్షయలు ఏర్పాటు చేసిన జీయోబోర్డు-టైప్స్ ఆఫ్ యాంగిల్స్ ప్రాజెక్టుకు ద్వితీయ బహుమలు లభించాయి. ఉపాధ్యాయుల విభాగంలో కర్లపాలెం మండలం గణపవరం జడ్పీ హైస్కూల్ సైన్స్ ఉపాధ్యాయురాలు డి.సుధారాణి ప్రదర్శించిన గ్రైన్‌డ్రైనర్ ప్రాజెక్టుకు ప్రథమ, బాపట్ల మండలం నరసాయపాలెం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల సైన్స్ ఉపాధ్యాయురాలు కె.స్వరూప ప్రదర్శించిన గ్రావిటీ బ్యాటరీ ప్రాజెక్టుకు ద్వితీయ బహుమతులు లభించాయి. విజేతలకు డీఈవో ఎస్.పురుషోత్తం బహుమతులు అందజేశారు. విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు వీరంతా వెళ్ళనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపవిద్యాశాఖాధికారులు ఎ.శ్రీనివాసరావు, జి.వెంకటేశ్వర్లు, ఎంఈవోలు ఎస్.నిరంజన్, డి.ప్రసాదరావు, జిల్లా సైన్స్ అధికారి మహమ్మద్ సాధిక్, ప్రధానోపాధ్యాయురాలు బి.రాజశ్రీ, సైన్స్ కోఆర్డినేటర్లు ఎ.శ్రీనివాసరావు, పవనీ భానుచంద్ర, వైవైరావు, సికిందర్, మీర్జాన్ తదితరులు పాల్గొన్నారు.


బహుమతి సాధించిన ప్రాజెక్ట్‌ను అధికారులు, నాయకులతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

జాతీయ స్థాయి క్రికెట్ ఛాంపియన్‌షిప్ విజేత విజ్ఞాన్



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ ఆచార్య నాగభూషణ్

గుంటూరు(విద్య), జనవరి 3 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ విద్యార్థుల ఆధ్వర్యంలో 18వ ఎడిషన్ మహోత్సవ్ 25లో భాగంగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి క్రికెట్ ఛాంపియన్‌షిప్ విజేతగా విజ్ఞాన్ యూనివర్సిటీ నిలిచింది. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ గ్రౌండ్‌లో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలపై విజ్ఞాన్ యూనివర్సిటీ జట్టు 25 పరుగుల తేడాతో గెలిచి ఛాంపియన్స్‌గా నిలిచారు. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్ చేసిన విజ్ఞాన్ యూనివర్సిటీ జట్టు నిర్ణీత 14 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 99 పరుగులు చేసింది. జట్టులో కెప్టెన్ తరుణ్ మల్ల 3 ఫోర్లతో 31 పరుగులు, అఫ్రీద్ ఖాన్ 2 ఫోర్లు, 1 సిక్స్‌తో 22 పరుగులు, అభిషేక్ 18 పరుగులు, మాటిన్ 14 పరుగులు చేశారు. నరసరావుపేట కాలేజి బౌలర్ మనోహర్‌కు 3 వికెట్లు లభించాయి. అనంతరం 100 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన నరసరావుపేట ఇంజినీరింగ్ కాలేజీ జట్టు నిర్ణీత 14 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 74 పరుగులు మాత్రమే చేసి 25 పరుగుల తేడాతో ఓటమి చెందింది. నరసరావుపేట ఇంజినీరింగ్ కాలేజ్ బ్యాట్స్‌మెన్‌లలో కెప్టెన్ అమర్వ్ 15, జయంత్ 14, షారుఖ్ ఖాన్ 12, జశ్వంత్ 12 పరుగులు చేశారు. విజ్ఞాన్ యూనివర్సిటీ బౌలర్లలో కెప్టెన్ తరుణ్ మల్లా, హర్షా చౌదరి, శుభం కుమార్, ఆకాష్, అభిషేక్ చెరో వికెట్ సాధించి విజయంలో కీలకపాత్ర పోషించారు. మూడో స్థానానికి జరిగిన పోటీలో బాపట్ల ఇంజినీరింగ్ కాలేజీపై ఎన్ఆర్ఐ ఇంజినీరింగ్ కాలేజి 16 పరుగుల తేడాతో గెలుపొందింది. జాతీయ స్థాయి క్రికెట్ ఛాంపియన్‌షిప్‌లో విజేతలుగా నిలిచిన జట్లకు ప్రశంసా పత్రాలు, మెడల్స్‌తోపాటు విన్నర్‌కు రూ.50,000, రన్నర్‌కు రూ. 30,000, మూడో స్థానంకు రూ. 20,000, నాలుగో స్థానంకు రూ.10,000 నగదు బహుమతులను అందజేస్తారు. మ్యాన్ ఆఫ్ ద సిరీస్, బెస్ట్ బ్యాట్స్‌మెన్ సీహెచ్ అఫ్రీద్, బెస్ట్ బౌలర్ జి.దీపక్, మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా మల్ల తరుణ్ నిలిచారు. కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది, ఫిజికల్ డిపార్ట్‌మెంట్ డైరక్టర్, కోచ్‌లు, మెంటర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీ నేతపై వైసీపీ మూకల దాడి

దుర్గి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పాతకక్షల నేపథ్యంలో టీడీపీ నేతపై వైసీపీ మూకలు దాడి చేసి గాయపరిచిన సంఘటన మండలంలోని అడిగొప్పులలో జరిగింది. గ్రామానికి చెందిన టీడీపీ నేత కొత్తా హనుమంతురావు శుక్రవారం గ్రామంలోని ప్రధాన రహదారిలో గల చర్చి ఆవరణ వద్ద ఉండగా, అదే గ్రామానికి చెందిన వైసీపీ నేతలు జంగా యలమంద, శ్రీను కర్రలతో తలపై దాడి చేశారు. దీంతో హనుమంతురావు తలకు గాయమైంది. గాయపడిన హనుమంతురావు తేరుకొని వైసీపీ నేత యలమందపై కర్రతో దాడి చేయగా యలమంద చేతికి గాయమైంది. హనుమంతురావు మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు ఇరువర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాగర్ ఎయిర్ పోర్టు నిర్మాణానికి ఆమోదం

- భూసేకరణ దిశగా అడుగులు
- 500 ఎకరాలు సేకరించాలని నిర్ణయం
- అటవీశాఖ అనుమతుల కోసం ప్రతిపాదనలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ప్రముఖ పర్యాటక కేంద్రం నాగార్జున సాగర్‌లో విమానాశ్రయాన్ని నిర్మించాలన్న ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఎయిర్‌పోర్టుల నిర్మాణాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం సమీక్షించారు. ఈ సమావేశంలో నాగార్జున సాగర్‌లో ఎయిర్ పోర్టు నిర్మాణానికి నిర్ణయం తీసుకున్నారు. ఎయిర్ పోర్ట్ కోసం ఫీజిబులిటీ నివేదిక కూడా సిద్ధం చేశారు. నిర్మాణానికి భూసేకరణ దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. 1670 ఎకరాల్లో ఎయిర్ పోర్టు నిర్మించనున్నారు. దీనిలో 1170 ఎకరాలు అందుబాటులో ఉన్నట్టు ప్రాథమికంగా నిర్ధారించారు. 500 ఎకరాల భూమి సేకరించాలని భావించి, అందుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇప్పటికే కావాల్సిన భూమిని గుర్తించారు. భూసేకరణపై దృష్టి సారించాలని ప్రభుత్వం ఆదేశించినట్టు జిల్లా యంత్రాంగం చెబుతుంది. భూసేకరణకు ఎయిర్ పోర్టు నిర్మాణం అంశంలో ఆటవీ శాఖ అనుమతుల అవసరం ఉంది. ఈ మేరకు ఆటవీ శాఖకు కూడా ప్రతిపాదనలు పంపాలని నిర్ణయించారు. కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం ఉండటం, దీనిలో తెలుగుదేశం భాగస్వామిగా ఉండటంతోపాటు రామ్మోహన నాయుడు కేంద్ర విమానయాన శాఖ మంత్రిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా కూడా సాగర్ ఎయిర్ పోర్టు నిర్మాణంపై అధ్యయనం చేసింది. ఇందుకు సంబంధించిన నివేదికను కూడా గత నెలలో ప్రభుత్వానికి సమర్పించింది. దీంతో సాగర్ విమానాశ్రయ నిర్మాణానికి మార్గం సుగమం అయింది. అటవీ శాఖ అనుమతులు రాగానే ఎయిర్‌పోర్టుకు సంబంధించిన భూసేకరణ ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమాయత్తమవుతోంది. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కేంద్ర అటవీ శాఖ అనుమతుల కోసం కృషి చేయనున్నారు. ఎయిర్‌పోర్టు నిర్మాణం పల్నాడు అభివృద్ధికి దోహదపడుతుందని అంచనా వేస్తున్నారు. పర్యాటక కేంద్రంతోపాటు సాగార్జున సాగర్ డ్యాం, బౌద్ధ క్షేత్రంగా కూడా ఈ ప్రాంతం విరాజిల్లుతుంది. ఎయిర్ పోర్టు నిర్మిస్తే విదేశీ పర్యాటకుల సంఖ్య సాగర్‌కు పెరిగే అవకాశం ఉంది. ఎన్నో ఏళ్ల నాగార్జునసాగర్‌లో ఎయిర్‌పోర్టు నిర్మాణం ప్రతిపాదనలకే పరిమితం కాగా, కూటమి ప్రభుత్వ హయాంలో సాకారం కానున్నది. రాష్ట్రంలో ఏడు ఎయిర్ పోర్టులు నిర్మించాలని ప్రతిపాదించగా, దీనిలో నాగార్జునసాగర్ కూడా ఉంది.

ప్రభుత్వ భూములను 'బొల్లా' ఆక్రమించారు

- మంత్రి అనగానికి ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఫిర్యాదు



భూ సమస్యలపై చర్చిస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): వినుకొండ నియోజకవర్గంలో తిమ్మాయపాలెం, వెంకుపాలెం, జాలలపాలెం గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు భారీ ఎత్తున భూ ఆక్రమణలకు పాల్పడ్డారని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. రెవెన్యూ సదస్సులు ముగింపు కార్యక్రమాల్లో భాగంగా రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆధ్వర్యంలో మంగళగిరిలోని ఏపీఐఐసీ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రాంతీయ రెవెన్యూ సదస్సులో రెవెన్యూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సిసోదియా, సీసీఎల్ చైర్మన్ జయలక్ష్మికి శుక్రవారం జీవీ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. బొల్లాపల్లి, ఈపూరు, నూజండ్ల, వినుకొండ మండలాల్లోని గుమ్మనంపాడు, అంగలూరు, తిమ్మాపురం, వి.అప్పాపురం, కొండ్రపోలు, శివాపురం, నాగులవరం అగ్రహారం భూముల విషయంలో రైతులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాల్లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి సమస్యలను పరిష్కరించాలని అన్నారు. నూజండ్ల, ఈపూరు మండలాల్లో ముర్తింజాపురం, పమిడిపాడు, గుండేపల్లి గ్రామాల్లో డీఫారెస్ట్ భూములకు హద్దులు నిర్ణయించాలని, పట్టాల పంపిణీ వేగవంతం చేయాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు గతంలో అధికారాన్ని అడ్డం పెట్టుకుని తన అనుచరులతో 22ఏ పేరుతో ఉన్న భూములను బెదిరించి 152 ఎకరాలకుపైగా లాక్కొన్నారని, వీటితోపాటు అటవీ, ప్రభుత్వ భూములను ఆక్రమించారని వీటిపై సమగ్ర దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామాల్లో సమగ్ర రీసర్వే నిర్వహించడం ద్వారా భూ సమస్యలు లేకుండా చూడాలన్నారు. నిరుపేదలకు రెండు సెంట్లు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

భూ సమస్యలపై ఎమ్మెల్యే ప్రత్తిపాటి వినతి

చిలకలూరిపేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరిస్తే ప్రజలకు కూటమి ప్రభుత్వంపై మంచి నమ్మకం ఏర్పడుతుందని స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు శుక్రవారం అన్నారు. రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆధ్వర్యంలో మంగళగిరిలోని ఏపీఐఐసీ భవన్‌లో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రీజినల్ రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సమావేశంలో చిలకలూరిపేట నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజల నుంచి వచ్చిన అర్జీల పరిష్కారానికి తీసుకున్న చర్యలపై సంబంధిత అధికారులను ప్రత్తిపాటి ప్రశ్నించారు. సమస్యల పరిష్కారానికి తగిన చొరవ చూపాలని, రెవెన్యూ అధికారులు, సిబ్బందికి తగిన ఆదేశాలు ఇవ్వాలని మంత్రి అనగానికి పుల్లారావు సూచించారు. నియోజకవర్గ వ్యాప్తంగా అపరిష్కృతంగా ఉన్న అర్జీల విషయంలో అధికారులు నిర్లిప్తంగా వ్యవహరించడంపై ప్రత్తిపాటి అసహనం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే రెవెన్యూ సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి అనగానికి సూచించారు. నియోజకవర్గంలో టెక్స్‌టైల్ పార్క్‌కు సర్వే నంబర్ 482లో కేటాయించిన 108 ఎకరాలు వేరే వ్యక్తుల ఆధీనంలో ఉన్నాయని, ఆ భూమిని వెంటనే విడిపించి ఇండస్ట్రియల్ పార్క్‌కు కేటాయించాలని కోరారు.

రేపు సివిల్స్ అభ్యర్థులకు మోడల్ పరీక్ష

- ఎంపికైన వారికి ఏడాది పాటు ఉచిత శిక్షణ
- డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ స్టడీ సర్కిల్ చైర్మన్ పి.లక్ష్మయ్య



మాట్లాడుతున్న పి.లక్ష్మయ్య, పక్కన చుక్కపల్లి రమేష్

గుంటూరు(తూర్పు), జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సివిల్స్‌కు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు ఈ నెల 5వ తేదీన ఉచిత మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నట్టు డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ స్టడీ సర్కిల్ చైర్మన్ పి.లక్ష్మయ్య తెలిపారు. కుందులరోడ్డులోని కమ్మ బాలికల వసతి గృహంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పరీక్షకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. పరీక్ష ఆదివారం సాయంత్రం 4 గంటలకు ప్రారంభమై 5 గంటల వరకు జరుగుతుందని అన్నారు. పరీక్షకు కమ్మ అభ్యర్థులు మాత్రమే అర్హులన్నారు. జేకేసీ కళాశాల గుంటూరు, ఆశోక్‌నగర్ హైదరాబాదు, పీవీఆర్ ఎడ్యుకేషనల్ సిటీ వినుకొండలో ఈ పరీక్ష జరుగుతుందని తెలిపారు. అందుబాటులో ఉన్న సెంటరు పేరు, ఇతర వివరాలను 83309 34815 నంబరుకు వాట్సాప్ ద్వారా పంపాలని సూచించారు. పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ స్టడీ సర్కిల్, న్యూ ఢిల్లీలో ఉచిత శిక్షణ, పుస్తకాలు, ట్యాబ్, వసతి, భోజనం ఏడాది పాటు అందజేస్తామని చెప్పారు. ఆ తరువాత ఆన్‌లైన్ ద్వారా రెండేళ్ల పాటు శిక్షణ అందజేస్తామని అన్నారు. కమ్మజన సేవ సమితి కార్యదర్శి చుక్కపల్లి రమేష్ మాట్లాడుతూ సివిల్స్ శిక్షణకు రూ.2 లక్షలు ఖర్చు అవుతుందనీ, దీనిని ఉచితంగా అందజేస్తున్న పి.లక్ష్మయ్యను అభినందిస్తున్నట్టు తెలిపారు. పరీక్ష ద్వారా 50 నుంచి 100 మంది అభ్యర్థులను ఎంపిక చేస్తున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో పాలకవర్గ సభ్యులు పెద్ది సాంబశివరావు, మర్రిపూడి సీతారామయ్య, మేనేజర్ చావా బోస్ తదితరులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావాన్ని జయప్రదం చేయండి

- తాళ్లాయపాలెం శైవక్షేత్ర పీఠాధిపతి శివస్వామి



మాట్లాడుతున్న శివస్వామి, పాల్గొన్న హిందు సంఘాల నాయకులు

గుంటూరు(తూర్పు), జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 5న విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో గన్నవరం విమానాశ్రయం సమీపంలో జరుగుతున్న హైందవ శంఖారావాన్ని జయప్రదం చేయాలని తాళ్లాయపాలెం శైవక్షేత్ర పీఠాధిపతి శివ స్వామి అన్నారు. గుంటూరు అరండల్‌పేటలోని మోహన రంగ స్వామి ఆలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సభకు వచ్చే హిందువుల కోసం హిందు ధార్మిక సంఘాల ప్రతినిధులు అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేశారని తెలిపారు. 5 లక్షల మంది పాల్గొనేలా సభా ప్రాంగణాన్ని తీర్చిదిద్దామన్నారు. సభకు పలు పీఠాధిపతులు హాజరౌతున్నారని అన్నారు. హిందువులను మాత్రమే దేవాలయాలపై ధార్మిక సంఘాలుగా ఏర్పాటు చేసి, దేవదాయ ధర్మాదాయ శాఖను రద్దు చేసే లక్ష్యంలో ఈ ఉద్యమాన్ని ప్రారంభించామని అన్నారు. ధార్మిక మండలి ఆధ్వర్యంలో దేవాలయాలు నిర్వహించుకునేలా చర్యలు తీసుకునే వరకు ఈ పోరాటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సామాజిక సామరసత వేదిక రాష్ట్ర కార్యదర్శి దర్శనపు శ్రీనివాసరావు, డాక్టర్ కల్లగంటి నాగార్జున, నరేంద్ర గౌతమ్, రామకృష్ణ, చిరుమామిళ్ల గోపి, పెద్దింటి కృష్ణ చైతన్య, రాజగోపాల్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

7న బీఎస్సీ అగ్రికల్చర్ స్పోర్ట్స్ కోటా కౌన్సెలింగ్

గుంటూరు సిటీ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అగ్రిటెక్-2024 ర్యాంకు ద్వారా బీఎస్సీ అగ్రికల్చర్ ప్రవేశాలలో మిగిలిన సీట్లకు, స్పోర్ట్స్ కోటా సీట్లకు చివరి దశలో మాన్యువల్ కౌన్సెలింగ్ ఈ నెల 7న నిర్వహించనున్నట్లు యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు తెలిపారు. గుంటూరు సమీపంలోని లాం ఫామ్ యూనివర్సిటీలోని కృష్ణ ఆడిటోరియంలో ఉదయం ఏడు గంటలకు కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఈ కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు. పూర్తి వివరాలకు ఏఎన్‌జీఆర్ఏయు.ఏసీ.ఐఎన్(angrau.ac.in) సంప్రదించాలని కోరారు.

కేంద్ర మాజీ మంత్రి సతీమణి మృతి

- ఆమె అల్లుడు ఒడిశా గవర్నర్ కంభంపాటి



శివప్రదాదేవి (ఫైల్)

పొన్నూరుటౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ఎంపీగా, కేంద్రమంత్రిగా గతంలో పని చేసిన పాములపాటి అంకినీడు ప్రసాదరావు సతీమణి శివప్రదాదేవి(94) శుక్రవారం నిడుబ్రోలులో మృతి చెందారు. నిడుబ్రోలుకు చెందిన అంకినీడు ప్రసాద్, శివప్రదాదేవి దంపతులకు పాములపాటి రాజేంద్రప్రసాద్, గంగాధర్‌ప్రసాద్ కుమారులతో పాటు అనసూయదేవి, కంభంపాటి జయశ్రీ కుమార్తెలు. శివప్రదాదేవి అల్లుడు ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు. ఆమె మృతి వార్త తెలుసుకున్న పలువురు ప్రముఖులు నివాళులు అర్పించారు.

సింహాద్రి, ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌ల తత్కాల్ కోటా సవరణ

గుంటూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సింహాద్రి, ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌ల తత్కాల్ కోటాని రైల్వే శాఖ సవరించింది. నంబరు. 17240 విశాఖపట్నం - గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రైలుకు ఈ నెల 14వ తేదీ నుంచి తత్కాల్ కోటాలో ఏసీ చైర్‌కార్ సీట్లు 16, సెకండ్ సిట్టింగ్ 50 ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయి. గతంలో ఈ సంఖ్య 10, 25గా ఉండేది. అలాగే నంబరు. 22701 విశాఖపట్నం - గుంటూరు ఉదయ్ ఎక్స్‌ప్రెస్ రైలుకు ఏసీ చైర్‌కార్ సీట్ల తత్కాల్ కోటాని 150 నుంచి 100కి తగ్గించారు. జనవరి 10వ తేదీ నుంచి ఈ నిర్ణయం అమలులోకి వస్తుంది. మరోవైపు సెకండ్ సిట్టింగ్ తత్కాల్ కోటాని 6కు పెంచారు.

మార్చి వరకు సంత్రగచి రైలు సర్వీసుల పొడిగింపు

ప్రతీ మంగళ, శనివారంలో బయలుదేరే నంబరు. 07221 సికింద్రాబాద్ - సంత్రగచి ప్రత్యేక రైలు సర్వీసులను ఈ నెల 7వ తేదీ నుంచి మార్చి 29వ తేదీ వరకు పొడిగించారు. అలాగే నంబరు. 07222 సంత్రగచి - సికింద్రాబాద్ (ప్రతీ బుధ, ఆదివారం) ప్రత్యేక రైలు సర్వీసులను ఈ నెల 8 నుంచి మార్చి 30వ తేదీ వరకు పొడిగించినట్లు సీపీఆర్‌వో ఏ.శ్రీధర్ తెలిపారు.

ధర్మవరం, తిరుపతి రైళ్లకు స్టాపేజ్‌ల పెంపు

నంబరు.17215/17216 మచిలీపట్నం - ధర్మవరం - మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్‌కి రేపటి నుంచి కొండాపురంలో అర్నెల్ల పాటు ప్రయోగాత్మక స్టాపేజ్‌ని కల్పిస్తున్నట్లు సీపీఆర్‌వో తెలిపారు. నంబరు. 17261/17262 గుంటూరు - తిరుపతి - గుంటూరు రైలుకు కోయిలకుంట్ల, జమ్మలమడుగులో స్టాపేజ్ కల్పిస్తున్నామన్నారు. నంబరు 07030 సికింద్రాబాద్ - అగర్తల, నంబరు. 07029 అగర్తల - సికింద్రాబాద్ రైళ్ల సర్వీసులను తదుపరి ప్రకటన వరకు పొడిగిస్తున్నట్లు తెలిపారు.

వైసీపీ హయాంలో విద్యా వ్యవస్థ నిర్వీర్యం

- టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్



నరసరావుపేట టౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ పాలనలో విద్యావ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం అయిందని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో అన్నారు. రాష్ట్రం, విద్యార్థుల భవిష్యత్తుని అంధకారంలో నెట్టేలా మాజీ సీఎం జగన్ నిర్ణయాలు చేశారన్నారు. విద్యారంగాన్ని తానే అభివృద్ధి చేసినట్టు జగన్మోహన్‌రెడ్డి సొంత డబ్బా కొట్టుకున్నారని ఎద్దేవా చేశారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో విద్యావ్యవస్థలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయన్నారు. విద్యా విధానంలో తలాతోక లేని నిర్ణయాలు జగన్ తీసుకున్నారని అన్నారు. జగన్ నియంతపోకడలతో రాష్ట్ర విద్యా వ్యవస్థ పూర్తిగా గాడి తప్పిందన్నారు. వైసీపీ ప్రభుత్వ అస్తవ్యస్తమైన సంస్కరణలతో 12,611 పాఠశాలలు ఏకోపాధ్యాయ బడులుగా మారాయన్నారు. దీనికి కేవలం జగన్ ఒంటెద్దు పోకడలే ప్రధాన కారణం అన్నారు.

రమేష్ హాస్పిటల్స్‌లో రేపు ఉచిత మెగా వైద్య శిబిరం

గుంటూరు మెడికల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సంస్థాగత సామాజిక బాధ్యతగా జనవరి 5వ తేదీ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం మూడు వరకు గుంటూరులోని ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ ప్రాంగణంలో ఉచిత మెగా సూపర్ స్పెషాలిటీ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు హాస్పిటల్స్ చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పి.రమేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరంతో గుండె, మెదడు, నరాలు, పక్షవాతం, జీర్ణకోశ వ్యాధులు, ఊపిరితిత్తుల, కిడ్నీ సంబంధిత వ్యాధులు, జ్వరాలు, సంక్రమణ వ్యాధులు, చిన్న పిల్లల, స్త్రీ, ప్రసూతి వ్యాధులు, సంతాన సాఫల్యత సమస్యలు, షుగర్, థైరాయిడ్, రక్తపోటు వంటి సమస్యలపై సూపర్ స్పెషాలిటీ డాక్టర్లు సేవలు అందిస్తారని ఆయన వివరించారు. శిబిరంలో అవసరమైన రోగులకు బీపీ, బీఎంఐ, షుగర్, ఈసీజీ, గుండె స్కానింగ్, ఊపిరితిత్తుల సామర్థ్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. వైద్య శిబిరంలో పాల్గొనదలచిన వారు ముందస్తుగా అప్పాయింట్‌మెంట్ తీసుకోవాలని, పాత వైద్యపరీక్షల రిపోర్టులను వెంట తీసుకురావాలని డాక్టర్ రమేష్‌బాబు కోరారు. ముందుగా అప్పాయింట్‌మెంట్ కోసం 0863-2377777 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

వివాహేతర సంబంధం నేపథ్యంలో హత్య

చిలకలూరిపేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): అక్రమ సంబంధం నేపథ్యంలో పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన పాలపర్తి నాగరాజు అలియాస్ తిమ్మిరి (40) అనే వ్యక్తి గురువారం రాత్రి దారుణ హత్యకు గురయ్యాడు. చిలకలూరిపేట అర్బన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నాగరాజు పట్టణంలోని డైక్‌మెన్ కాలనీకి చెందిన అక్కల చెంచయ్య భార్య నన్నీతో అక్రమ సంబంధం ఏర్పరచుకున్నాడు. భర్త చెంచయ్యను వదిలేసిన నన్నీ నెల రోజులుగా నాగరాజుతో కలిసి పట్టణంలోని సుభానినగర్‌లో ఒక ఇల్లును అద్దెకు తీసుకొని నివాసం ఉంటున్నారు. దీంతో నాగరాజుపై నన్నీ భర్త చెంచయ్య కక్ష పెంచుకున్నాడు. చెంచయ్య తన అన్న కుమారుడు అక్కల ప్రభుదాసుతో కలిసి నాగరాజును హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. సుభానినగర్‌లో నాగరాజు ఉంటున్న అద్దె ఇంటికి వెళ్లి చాకుతో గొంతు కోసి చంపినట్టు పోలీసులు పేర్కొన్నారు. అర్బన్ సీఐ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం స్థానిక ప్రభుత్వాసుపత్రికి పోలీసులు తరలించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని యాచకురాలు మృతి

గురజాలటౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొని యాచకురాలు మృతిచెందిన సంఘటన గురజాల పట్టణంలో చోటుచేసుకుంది. గురజాల ఆర్టీసీ బస్టాండ్‌లో 40 ఏళ్ల వయస్సు ఉన్న గుర్తుతెలియని మహిళ మూడు నెలలుగా భిక్షాటన చేస్తూ జీవిస్తుంది. ఈమెకు రెండు కాళ్లు పనిచేయడం లేదు. గురువారం రాత్రి 8 గంటల సమయంలో బస్టాండ్ వద్ద భిక్షాటన చేస్తుండగా మాచర్ల నుంచి గుంటూరు వెళ్తున్న ఆర్టీసీ (గుంటూరు డిపో) బస్సు ఆమెను ఢీకొంది. ఈ సంఘటనలో యాచకురాలు అక్కడికక్కడే మృతి చెందింది. పట్టణ పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతురాలు వివరాలు తెలిసిన వారు పోలీస్‌స్టేషన్లో సంప్రదించాలని కోరారు. ఆర్టీసీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏటీఎంను ధ్వంసం చేసిన దుండగులు



నకరికల్లులో దుండగులు ధ్వంసం చేసిన ఏటీఎం

నకరికల్లు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): నకరికల్లు సర్వీస్ రోడ్డులో ఉన్న ఇండియా వన్-1 ఏటీఎంను గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు డబ్బులు దొంగిలించేందుకు ఏటీఎంను పగలగొట్టారు. ఏటీఎం స్క్రీన్, కీ బోర్డు, కార్డు రైడర్‌ను దుండగులు ధ్వంసం చేశారు. నగదును అపహరించే ప్రయత్నం చేశారు కాని వీలు కాక పోవటంతో దుండగులు ఏటీఎంకు సంబంధించిన వస్తువులను ధ్వంసం చేసి వెళ్లి పోయినట్లు పోలీసులు తెలిపారు. ఇండియా-1 ఏటీఎం గుంటూరు జిల్లా ఫ్రాన్చైజ్ మేనేజర్ పోతూరి నాగ పవన్ కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శుక్రవారం నాటికి 569.30 అడుగులు ఉంది. ఇది 254.81 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9633 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8280 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 20,613 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 20,613 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో శుక్రవారం 39.30 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పవర్ జనరేషన్ ద్వారా రెండు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుందని ప్రకటనలో పేర్కొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.35
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111,119,130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00

45,194 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 40,012 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 45,194 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 44,381 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	7500	13500	334	7500	13500
నెంబరు. 5	8000	13500	నెంబరు.5	9000	11000
273	8000	11000	273	11500	12000
341	8000	15000	341	8300	12500
4884	--	--	4884	12000	14000
సూపర్ 10	--	--	సూపర్ 10	11200	11200
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	7500	16200	తేజ	8000	16000
బ్యాడిగి	8000	12500	బ్యాడిగి	8000	12000
దేవనూరు డీలక్స్	8000	15500	దేవనూరు డీలక్స్	9000	11500
తెల్లకాయలు	4000	10500	తెల్లకాయలు	4000	9500

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి : తహసీల్దార్

పిట్టలవానిపాలెం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల తహసీల్దార్ పి.మెహర్‌కుమార్ అన్నారు. మండలంలోని కోమలి గ్రామపంచాయతీ సచివాలయాల పరిధిలో తహసీల్దార్ అధ్యక్షతన రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ దేవదాయ శాఖ సంబంధించిన అధికారులతో శుక్రవారం రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. మొత్తం 24 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఎస్.శ్రీనివాసరావు, సర్వేయర్ ఆది రామచంద్రరావు, కె.శ్రీనివాసరావు, మండలస్థాయి అధికారులు, వీఆర్వోలు, వీఆర్ఏలు, కోమలి గ్రామసర్పంచ్ శ్యామల నాగిరెడ్డి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

వీఆర్వో పనితీరుపై తహసీల్దార్ ఆగ్రహం

నగరం, జనవరి 3(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పూడివాడ గ్రామపంచాయతీకి చెందిన వీఆర్వో కోటేశ్వరరావు పని తీరుపై స్థానిక తహసీల్దార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ మాజీ సర్పంచ్ శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ కోటేశ్వరరావులు తహసీల్దార్‌కు వీఆర్వోపై ఫిర్యాదు చేశారు. వీఆర్ఓ కోటేశ్వరరావు విధులకు సక్రమంగా హాజరుకావటం లేదని వారు ఆరోపించారు. తహసీల్దార్ వివరణ కోరగా కోటేశ్వరరావు కంప్యూటర్ పని చేయటం లేదని సమాధానం చెప్పారు. వారం రోజుల్లో రికార్డులను సరిచేసుకోవాలని వీఆర్వోను తహసీల్దార్ ఆదేశించారు.

పేరలి సర్పంచ్‌గా వీరయ్య

కర్లపాలెం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండలంలోని పేరలి పంచాయతీ సర్పంచ్‌గా గొర్రెముచ్చు వీరయ్య శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్ జె.వెంకటమురళి ఆదేశాల మేరకు పేరలి పంచాయతీ సర్పంచ్‌గా వీరయ్యను డీఎల్‌పీవో శరత్‌బాబు సర్పంచ్‌గా పేరలి పంచాయతీ కార్యాలయంలో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మధ్యాహ్న భోజనం ప్రారంభం

వేమూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని వేమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు శనివారం ప్రారంభించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ గాయత్రి తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు చేతుల మీదుగా భోజన పథకాన్ని ప్రారంభిస్తామన్నారు. విద్యాశాఖకు చెందిన పలువురు అధికారులు హాజరవుతారని చెప్పారు.

కిశోరి బాలికల వికాసంపై అవగాహన సదస్సు

వేమూరు, కొల్లూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ కార్యాలయం మీటింగ్ హాలులో కిశోరి బాలిక వికాసం, మహిళ సంరక్షణపై కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. అమృతలూరు ప్రాజెక్టు ఐసీడీఎస్ అధికారి విజయలక్ష్మి, ఎంఈవో వెంకటేశ్వర్లు, యూపీఆర్‌డీ శేఖర్ పాల్గొన్నారు. కొల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సీడీపీవో విజయలక్ష్మి, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో నరసింహారావు, ఏసీడీపీవో విజయరాణి, కార్యకర్తలు, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలి

రేపల్లె, జనవరి 3(ఆంధ్రజ్యోతి) : సావిత్రిబాయి పూలే ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్ళాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు. నిజాంపట్నం మండలం బొర్రావారిపాలెంలో శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలకు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో దామాషా వాటా హక్కులు కల్పించిన నాడే సావిత్రిబాయిపూలేకు నిజమైన నివాళి అన్నారు. ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు, సజ్జావారిపాలేనికి చెందిన కళాకారుడు వల్లభనేని సత్యసాయిబాబును మంత్రి సోదరుడు శివప్రసాద్, శంకరరావులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ బడుగు వెంకటనారాయణ, కొలసాని రాము, బొర్రా సురేంద్ర, పలువురు బీసీ నాయకులు పాల్గొన్నారు.

● సావిత్రిబాయి పూలే జీవితం నేటి మహిళా లోకానికి ఆదర్శణీయమని జైభీమ్‌రామ్‌భారత్ పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు దోవ రమేష్‌రాంజీ అన్నారు. శుక్రవారం అంబేద్కర్ విగ్రహం వద్ద ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో క్రర్రా బాబూరావు, ఎస్.వెంకట్రావు, పంతగాని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● బాపట్ల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : భారతదేశ తొలిమహిళా ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలే మహిళల విద్యాభివృద్ధికి సమాజంతో పోరాడారని బీటీపీ నాయకులు అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమాన్ని బాపట్ల మండలపరిషత్ కార్యాలయ ప్రాంగణంలోని పూలే దంపతుల విగ్రహాల వద్ద శుక్రవారం నిర్వహించారు. బీటీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సురేష్‌బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి సీనియర్ నాయకులు గడ్డం ఏలియా, బిఎస్‌పి నాయకులు గుదే రాజారావు, గవిని గోపాలకృష్ణ, బడుగు జీవన్, పి.జాన్ వెస్లీ, జెట్టి జోసఫ్, కట్టా కోర్నేలు పాల్గొన్నారు.



సమీకృత గిరిజన సంక్షేమ బాలికల వసతి గృహం విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎంపీ కృష్ణప్రసాద్ సతీమణి శిరీష



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న కేసన శంకరరావు, మంత్రి సోదరుడు శివప్రసాద్

● సావిత్రిబాయి పూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని వైసీపీ దివ్యాంగుల నాయకుడు చల్లా రామయ్య కోరారు. సావిత్రిబాయి పూలే జయంతిని శుక్రవారం మండలపరిషత్ కార్యాలయ ప్రాంగణంలోని పూలే దంపతుల విగ్రహాల వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తమలపాకుల భాస్కరరావు, మార్పు మేర్సీ, కొమ్మినేని లక్ష్మీనారాయణ, ఆకురాతి విష్ణుమూర్తి, భోగిరెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొని ఆమె విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు.

● సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమంలో సాహితిభారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ, కోశాధికారి ఆదంషపీ, ఉపాధ్యక్షులు మర్రిమాల్యాద్రిరావు, డాక్టర్ శ్రీనివాస్‌లు మాట్లాడుతూ తొలి మహిళా ఉపాధ్యాయునిగా ఎంతో సేవ చేశారని అన్నారు. అనంతరం కస్తూరి శ్రీనివాసరావు, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి పువ్వాడ వెంకటేశ్వర్లు తదితరులు సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● పట్టణంలోని సమీకృత గిరిజన సంక్షేమ బాలికల వసతిగృహంలో శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ సతీమణి శిరీషా ముఖ్యఅతిథిగా పాల్గొని ఆమె పటానికి పుష్పాంజలి ఘటించి విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో రాణించాలని, అప్పుడే సావిత్రిబాయి పూలేకు మనం అర్పించే నిజమైన నివాళి అన్నారు. అనంతరం విద్యార్థినీలకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు.

● నగరం, జనవరి 3(ఆంధ్రజ్యోతి) : సావిత్రిబాయి పూలే జయంతిని జాతీయ మహిళా దినోత్సవంగా ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. మహిళా ఉపాధ్యాయురాలు రాజ్యలక్ష్మి, అనురాధలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు భద్రినారాయణ, ఉపాధ్యాయులు నెహ్రా, రాఘవయ్య, సుదర్శన్, రమేష్, భాస్కరరావు, లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.



కామేపల్లి కృషిబాబుకు నివాళులర్పిస్తున్న ప్రవర ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ డాక్టర్ రాజేంద్ర వీకే పాటిల్, రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి తదితరులు

కృషి బాబు మృతి తీరనిలోటు

● ప్రవర ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ డాక్టర్ రాజేంద్ర వీకే పాటిల్

బాపట్ల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : హైకోర్టు సీనియర్ న్యాయవాది, టీడీపీ నాయకుడు కామేపల్లి కృషిబాబు హఠాన్మరణం తీరనిలోటు అని మహారాష్ట్ర ఇరిగేషన్ శాఖా మంత్రి డాక్టర్ రాధాకృష్ణ వీకే పాటిల్ సోదరుడు, ప్రవర ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ డాక్టర్ రాజేంద్ర వికె పాటిల్ అన్నారు. మండలంలోని నరసాయపాలెం గ్రామంలో కృషిబాబు కుటుంబ సభ్యులను శుక్రవారం పలువురు ప్రముఖులు పరామర్శించారు. ఆయన పటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించారు. కృషిబాబు సోదరుడు కామేపల్లి భూపాల్‌ను, కుటుంబ సభ్యులను ఓదార్చి సానుభూతి తెలిపారు. కృషిబాబుతో తనకున్న అనుబంధాన్ని పంచుకున్నారు. రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ నరసాయపాలెం అభివృద్ధికి దోహదపడిన కృషిబాబు మరణం తీరనిలోటు అని విచారం వ్యక్తం చేశారు. నివాళులు అర్పించిన వారిలో విశ్రాంత అధ్యాపకులు గోరంట్ల శాంతారాం, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక మహిళా కార్యదర్శి, మాజీ ఎంపీపీ మానం విజేత, డాక్టర్ రాంబాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి : కమిషనర్

బాపట్ల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు వ్యాధులు ప్రబలకుండా పరిసరాలు పరిశుభ్రం చేయటంతోపాటు వారికి అవగాహన కల్పించాలని కమిషనర్ జి.రఘునాథరెడ్డి సిబ్బందికి తెలియజేశారు. శుక్రవారం ఆయన వార్డులలో పర్యటించారు. డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా పర్యటించిన ఆయన రోడ్ల పక్కనే నిలిచిన మురుగు, వ్యర్థాలను తీసివేయించి యాంటీలార్వా స్ప్రే చేయించారు. శానిటరి ఇన్‌స్పెక్టర్ సీహెచ్ పద్మ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. పడమర బాపట్ల పరిధిలో ప్రభుత్వ చెరువు పోరంబోకు భూమి అన్యాక్రాంతం అవుతున్నందున అక్కడ బోర్డు ఏర్పాటు చేయించారు. ప్రభుత్వ భూమి ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు.

ఆయుర్వేదంతో అందరికీ ఆరోగ్యం : డాక్టర్ కొలకాని

బాపట్ల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : భారతీయ సాంస్కృతిలో భాగమై అనాదిగా ప్రజలతో మమేకమైన ఆయుర్వేదంతో అందరూ ఆరోగ్యంగా ఉంటారని ఆయుర్వేద వైద్యులు కొలకాని బాబుటాండన్ తెలిపారు. పట్టణంలోని ప్రశాంతి నిలయంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలు నుంచి వచ్చిన వంద మంది ఆయుర్వేద వైద్యులు శుక్రవారం సమావేశం అయ్యారు. మూలికా వైద్యంపై ఉదాసీనత తగదన్నారు. కష్టమైన రోగాలను కూడా ఆయుర్వేదం నయంచేసిందన్నారు. అనంతరం బాబుటాండన్‌ను ఘనంగా సత్కరించి సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్యాంధన్, సీహెచ్ రమేష్, ఎంఆర్ కిషోర్, నబీరసూల్, నండూరు నాని, వహిద్‌ఆలీ తదితరులు పాల్గొని ఆయుర్వేద వైద్య విశిష్ఠత గురించి వివరించారు.

ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

రేపల్లె, జనవరి 3(ఆంధ్రజ్యోతి) : ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సిహెచ్ మణిలాల్ అన్నారు. మున్సిపల్ కార్యాలయం వద్ద సీఐటీయూ రాష్ట్రవ్యాప్తంగా ఇచ్చిన పిలుపుమేరకు ఇంజనీరింగ్ కార్మికులు, సీఐటీయూ నాయకులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం సమస్యలు పరిష్కారం కోరుతూ మున్సిపల్ కమిషనర్ సాంబశివరావుకు వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు ప్రభాకరరావు, కార్యదర్శి ఎన్.రఘుబాబు, శివ, రవి, రాఘవేంద్రరావు, రమేష్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అంతర్జాతీయ స్థాయి శాస్త్రవేత్తలుగా ఎదగాలి

● ఎమ్మెల్యే నరేంద్రవర్మ



రాష్ట్రస్థాయి సైన్స్‌ఫెయిర్‌కు ఎంపికైన వర్కింగ్ మోడల్‌తో నరసాయపాలెం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థిని, సైడ్‌టీచర్‌లు

బాపట్ల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : చిన్నపిల్లలు పెద్ద ఆలోచనలతో అనేక రకాల వర్కింగ్ మోడల్స్ తయారు చేయటం సంతోషదాయకమని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో శుక్రవారం జిల్లా స్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేశారు. డీఈవో ఎస్.పురుషోత్తం అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించి ప్రారంభ సభలో ప్రసంగిస్తూ నేటి విద్యార్థులు రేపటి అంతర్జాతీయ స్థాయి శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా ఎదిగిన అబ్దుల్‌కలాంను ఆదర్శంగా తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఉపవిద్యాశాఖాధికారులు ఎ.శ్రీనివాసరావు, జి.వెంకటేశ్వర్లు, మండల విద్యాశాఖాధికారులు డి.ప్రసాదరావు, ఎస్.నిరంజన్, జిల్లా సైన్స్ అధికారి మహమ్మద్‌సాధిక్, ప్రధానోపాధ్యాయురాలు బి.రాజశ్రీ, సైన్స్ కోఆర్డినేటర్లు ఎ.శ్రీనివాసరావు, పావని భానుచంద్ర, వైవైరావు, సిఖేందర్, మీర్జా, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, టీడీపీ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పల్లం సరోజనీ, సీనియర్ నాయకులు మందపాటి ఆంద్రేయ, కాగిత నాగభూషణమ్మ, టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు వడ్లమూడి వెంకటేశ్వరరావు, అడే వంశీ, షాలెంరాజు, దగ్గుమల్లి రాణి, కూచిపూడి ఝాన్సీరాణి, షేక్ నజ్మా, హైమావతి పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి చర్యలు తీసుకోవాలి : కలెక్టర్



బాపట్ల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : మహిళల జీవనోపాధుల పెరుగుదలకు అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. వివిధ శాఖల అధికారులతో శుక్రవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జీవనోపాధి పథకం అనుసంధానంతో మహిళల అర్థికాభివృద్ధికి బాటలు వేయాలని చెప్పారు. పాడిగేదెల పథకం కింద పొదుపు సంఘాల మహిళలకు గేదెలు పంపిణీ చేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు మండలాల వారిగా లబ్ధిదారుల ఎంపిక వేగంగా పూర్తి చేయాలన్నారు. గేదెల కొనుగోలు ప్రక్రియ పక్కాగా చేపట్టాలన్నారు. జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధిపై ప్రణాళికలు రూపొందించి నివేదిక పంపాలని డీపీవోను ఆదేశించారు. ఆక్వా పార్క్ ప్రతిపాదనపై సమగ్ర నివేదిక పంపాలని సూచించారు. పీజీఆర్ఎస్‌లో నమోదై రెవెన్యూ అంశాల పరిష్కారంపై అధికారులు దృష్టిసారించాలన్నారు. సమావేశంలో డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్, డీఆర్‌డీఏ పీడీ పద్మ, డీపీవో ప్రభాకర్, మత్స్యశాఖ ఇన్‌చార్జి ఏడీ పాల్గొన్నారు.

నూతన సంవత్సర డైరీ ఆవిష్కరించిన డీఎంహెచ్‌వో

బాపట్ల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో శుక్రవారం డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ నూతన సంవత్సర డైరీ ఆవిష్కరించారు. ఏపీఎన్‌హెచ్‌ఎం జేఏసి కన్వీనర్ సీహెచ్ ప్రభాకర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ప్రదీప్‌కుమార్, ఉపాధ్యక్షులు ప్రేమపావని, ప్రమోద్‌కుమార్, రాష్ట్రనాయకులు ప్రేమ్‌కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్వీఆర్ఎం కళాశాల క్రీడోత్సవాలు

నగరం, జనవరి 3(ఆంధ్రజ్యోతి) : విద్యార్థినీ, విద్యార్థులు విద్యతో పాటు ఆటలలో రాణిస్తూ ఎస్వీఆర్ఎం కళాశాల కీర్తిని జాతీయ అంతర్జాతీయ స్థాయిలో నిలపటం శుభపరిణామమని ఫార్మర్ సెక్రటరీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా మాజీ డైరెక్టర్, సీబీఎస్ఈ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ డిపార్టుమెంట్ డాక్టర్ కేసీహెచ్ పున్నయ్యచౌదరి అన్నారు. స్థానిక ఎస్వీఆర్ఎం కళాశాలలో ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ డే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో బ్రాంచ్ మెడల్ సాధించిన ఎం.గాయిత్రి, అవినేష్‌బాబు, ఆలిండియా వెయిట్‌లిఫ్టింగ్ కాంపిటీషన్ బ్రాంచ్ మెడల్ సాధించటం ఎంతో అభినందనీయమన్నారు. అనంతరం కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వల్లభనేని బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ క్రీడలు క్రమశిక్షణ, సహనాన్ని నేర్పిస్తాయన్నారు. కళాశాల వైస్ ప్రెసిడెంట్ ఎస్వీ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ కళాశాల క్రీడాకారులకు ఎప్పుడు ప్రోత్సాహకాలు ఉంటాయన్నారు. అనంతరం బహుమతులను ప్రదానం చేశారు. కళాశాల అకాడమిక్ డైరెక్టర్ వీవీ వెంకటేశ్వరరావు, పీటీ సాంబమూర్తి, కళాశాల ఇంటర్మీడియట్ ప్రిన్సిపాల్ అనగాని శ్రీనివాసరావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అనగాని హరికృష్ణ, అమరేష్‌రెడ్డి, పి.శ్రీనివాసరావు, సురేష్‌బాబు పాల్గొన్నారు.

న్యాయవాదిపై అక్రమ కేసును ఎత్తి వేయాలి

రేపల్లె, జనవరి 3(ఆంధ్రజ్యోతి) : న్యాయవాది బేతాళ ప్రకాశ్‌పై పొన్నూరు పోలీసులు పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలంటూ రేపల్లె బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేసన గోపాలరావు అన్నారు. న్యాయవాదిపై పెట్టిన అక్రమకేసును ఎత్తి వేయాలంటూ శుక్రవారం తాలూకా సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో రేపల్లె బార్ అసోసియేషన్ న్యాయవాదులు పాల్గొన్నారు.

తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి : రూరల్ సీఐ

బాపట్లరూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని బాపట్ల రూరల్ సీఐ కె.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల సమీపంలోని రహదారి వద్ద వాహనాల తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించి వాహనదారులకు సూచనలు చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బాపట్లరూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాల పాలై వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. బాపట్లరూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం కర్లపాలెం మండలం పేరలిపాడు గ్రామానికి చెందిన జంగం శామ్యూల్ బాపట్ల ఆర్టీసీ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. గురువారం బాపట్ల నుంచి ఇంటికి తన ద్విచక్రవాహనంపై వెళుతుండగా నందిరాజుతోట సమీపంలోని నాగరాజుకాల్వ బ్రిడ్జి సమీపంలో ఎదురుగా వస్తున్న అశోక్ లైల్యాండ్ ఆటో ఢీకొట్టింది. దీంతో శామ్యూల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అంబులెన్స్ ద్వారా బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్సై ఎం.శ్రీనివాసరావు తెలిపారు.

వేడినీళ్ళ బక్కెట్‌లో పడి బాలుడి మృతి

బాపట్ల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 33వ వార్డు అరవ కాలనీలో 5 సంవత్సరాల బాలుడు వేడినీళ్ళు ఉన్న బక్కెట్‌లో పడి తీవ్రంగా గాయపడ్డాడు. తల్లి పావని ఆసుపత్రికి తీసుకెళ్ళగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పాడిపరిశ్రమ పరిడవిల్లేందుకు
ఎస్ ఎస్ ఎస్



రైతులు ఈ అవకాశం వినియోగించుకోవాలి

- డాక్టర్ ఓ నరసింహరావు, జిల్లా పశుసంవర్థక శాఖాధికారి

గేదెలు, ఆవులకు సార్టెడ్ సెక్స్ సెమెన్ పద్ధతిలో గర్భధారణతో పాడిరైతులకు ఎనలేని ప్రయోజనం వుంటుంది. పాడి పరిశ్రమ పరిడవిల్లుతుంది. రైతులు ఈ అవకాశం వినియోగించుకోవాలి. ఇప్పటికే ఈ పద్ధతిలో గర్భధారణ చేసిన పశువులు ఆడ దూడల కు జన్మనిచ్చాయి. సాంప్రదాయ పద్ధతి కన్నా ఇది చాలా ప్రయోజనకరం.



సార్టెడ్ సెక్స్ సెమెన్ ఇచ్చిన తర్వాత పుట్టిన ఆడ దూడతో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ నరసింహరావు

- సత్ఫలితాలిస్తున్న సార్టెడ్ సెక్స్ సెమెన్ ప్రయోగం
- వై- క్రోమోజోమ్ నిర్మూలనతో 95 శాతం ఉత్తమ ఫలితం
- జిల్లాలో 4974 పశువులకు ఈ పద్ధతిలో గర్భధారణ
- పెరగనున్న పాడిరైతుల ఆదాయం

గుంటూరు సిటీ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆడ శిశువులను అంతమొందించేందుకు మను షులు చేసే అకృత్యాల గురించి ఆనోటా ఈనోటా వింటూనే ఉంటాం. పత్రికల్లోనూ, టీవీ చానల్స్‌లోనూ, సోషల్ మీడియా వేదికగానూ వచ్చే ఈ తరహా వార్తలు విస్తుపోయేలా చేస్తూనే ఉంటాయి. కానీ, పశువుల్లో మాత్రం ఆడదూడలను పెంపొందించేందుకు ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థికాభివృద్ధికి ప్రధాన వనరుగా ఉన్న పాడిపరిశ్రమను ప్రోత్సహించేందుకు గాను సార్టెడ్ సెక్స్ సెమెన్ (ఎస్ఎస్ఎస్) పద్ధతిని ప్రభుత్వం అతి తక్కువ ఖర్చుతో అందుబాటులోకి తెచ్చింది. పశుసంవర్ధక శాఖ ప్రవేశపెట్టిన ఎస్ఎస్ఎస్ ద్వారా పశువుల్లో కొత్త శకానికి నాంది పలుకుతోంది. పాడి రైతులు పెంచుకునే గేదెలు లేదా ఆవులకు ఆడదూడలు మాత్రమే పుట్టేందుకు అవకాశం ఉంటుంది. పశువీర్యంలో మగదూడ పుట్టేందుకు కారణం అయిన వై -క్రోమోజోమ్‌ను నిర్మూలించడం జరుగుతుంది. కేవలం ఎక్స్ఎక్స్ క్రోమోజోమ్ ఉన్న వీర్యాన్ని పశువుల గర్భంలోకి ప్రవేశపెడతారు. గత కొన్ని నెలలుగా ఈ పద్ధతిలోనే పశువులకు గర్భధారణ చేస్తున్నారు. ఎస్ఎస్ ఎస్ పద్ధతిలో గర్భం దాల్చిన పశువుల్లో 95 శాతం ఆడదూడలకే జన్మనిచ్చినట్లు జిల్లా పశు సంవర్ధక శాఖ వెల్ల డించింది.

పాడి పశువులకు సార్టెడ్ సెక్స్ సెమెన్ (ఎస్ఎస్ఎస్) దోసులతో కొత్త శకానికి నాంది పలకనుంది. ఈ పద్ధతి ద్వారా పశువీర్యంలో మగదూడ పుట్టేందుకు కారణం అయిన వై -క్రోమోజోమ్‌ను నిర్మూలిస్తారు. కేవలం ఎక్స్, ఎక్స్ క్రోమోజోమ్ ఉన్న వీర్యంను మాత్రమే పశువుల గర్భంలోకి ప్రవేశ పెడతారు. గత కొన్ని నెలల నుంచి జిల్లాలో ఆవులు, గేదేలకు ఈ పద్ధతిలో గర్భధారణ చేస్తుండటం సత్ఫలితాన్ని ఇస్తోంది.



ఆవు, గేదెకు సార్టెడ్ సెక్స్ సెమెన్ డోసు ఇస్తున్న దృశ్యం

సాధారణ పద్ధతిలో రూ.40

సాధారణ పద్ధతిలో పశువు గర్భధారణ గావించేందుకు వీర్యం డోసులు ఇస్తుంటారు. అందుకు కేవలం రూ. 40 మాత్రమే ఖర్చు అవుతుంది. ఈ పద్ధతిలో ఆడ, మగ దూడలు సరి సమాన స్థాయిలో జన్మిస్తాయి. ఎస్ఎస్ఎస్ విధానంలో వై-క్రోమోజోమ్‌ను నిర్మూలించడం ఖర్చుతో కూడుకున్న సంగతి.

ఎస్ఎస్ఎస్ డోసులు రూ. 500

కేవలం రూ. 500 కే ఎస్ఎస్ఎస్ రెండు డోసులు పశువులకు వేస్తారు. గేదె, ఆవు ఎదకు వచ్చిన తర్వాత మొదటి డోసు వేస్తారు. అప్పటికీ అది కట్టకపోతే 21 రోజుల వ్యవధిలోనే రెండో డోసు వేస్తారు. అప్పటికి కూడా ఫలితం లేకపోతే పెట్టిన ఖర్చు రూ. 500 వెనక్కి తిరిగి ఇచ్చేస్తారు. ఒకవేళ ఈ డోసులు ఇచ్చిన తర్వాత కూడా మగదూడ పుడితే రూ. 250 పశు సంవర్ధక శాఖ తిరిగి చెల్లిస్తుంది.

95 శాతం ఉత్తమ ఫలితం

ఇప్పటివరకూ గుంటూరు జిల్లాలో 4,974 పశువులకు ఈ డోసులు ఇచ్చారు. వాటిలో 95 శాతం పశువులు ఆడదూడలకు జన్మనిచ్చాయి. సంగం డెయిరీలో కూడా 3,190 పశువులకు ఇదే పద్ధతిలో గర్భధారణ గావించింది.



ఈ ఏడాది లక్ష్యం పదివేలు

గుంటూరు జిల్లాలో 2024-2025 సంవత్సరానికి 10 వేల పశువులకు ఎస్ఎస్ఎస్ పద్ధతిలో గర్భధారణ గావించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. ఇప్పటివరకు 2,850 పశువులకు ఈ డోసులు ఇచ్చినట్లు సంబంధిత శాఖ అధికారులు తెలిపారు. పశుసంవర్ధక శాఖ దీనిపై విస్తృతమైన ప్రచారం చేస్తుంది.

ఇంకెన్నాళ్లు..
రేషన్ డోర్ డెలివరీ

(5వ పేజీ తరువాయి..)

హయాంలో ఎండీయూల ద్వా రా బియ్యం తప్పించి ఇవ్వక పోవడం దానికీ కూడా రోజుల తరబడి ఎదురుచూడాల్సి రావడంతో కార్డుదారులు ఈ విధానంపై అసం తృప్తితో ఉన్నారు.

పెరిగిన బియ్యం అక్రమాలు..

ఎండీయూ వాహనాలు వచ్చిన తరువాత రేషన్ మాఫియా అక్రమాలు విపరీతంగా పెరిగాయి. మొబైల్ వాహనాలు వచ్చిన తర్వాత వారి అక్రమాలు మరింత సులువయ్యా యి. నేరుగా ఆ వాహనాల్లోనే అక్రమార్కులు పేదల బి య్యాన్ని కొల్లగొట్టి తరలించుకుపోతున్న ఘటనలు అనేకం ఉన్నాయి. అదీ చాలదన్నట్లు అక్రమాలకు అలవాటుపడిన వాహనదారులు, డీలర్లు చాలామంది లబ్ధిదారులకు టోకరా ఇస్తున్నారు. ఇరువురూ కుమ్మక్కై లబ్ధిదారులకు రేషన్ ఎగ వేసేందుకు 'డోర్ డెలివరీ' విధానాన్ని ఒక సాధనంగా మార్చుకున్నారు. సమయానికి కార్డుదారులు లేరన్న నెపం తో రేషన్ ఎగవేసి, దాన్నే ఆదాయ మార్గంగా మార్చుకు న్నారు. ఫలానా రోజు ఫలానా వీధికి వస్తారన్న గ్యారంటీ లేకుండా వారికి ఇష్టమొచ్చిన రీతిలో తేదీలు మార్చి మార్చి వెళుతున్నారు. వాహనం ఎప్పుడు వస్తుందో తెలి యక పనులకు వెళ్లినవారు రేషన్ నష్టపోతున్నారు. దీనికి తోడు వాహనంలో తక్కువ సరుకులు తీసు కువచ్చి కొందరికి సరఫరా చేసి, 'సరుకులు అయిపో యాయి.. మళ్లీ వస్తామని' చెప్పి వెళ్లిపోతున్నారు. తిరిగి ఆ వీధికి వెళ్లకుండా తప్పుకుంటున్నారు. ఫలి తంగా లబ్ధిదారులు రేషన్ షాపుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. వాహనదారులు కుమ్మక్కైన డీలర్లు ఒకరిపై ఒకరు నెపం చూపి లబ్ధిదారులను పదే పదే తిప్పి రేషన్‌ను ఎగవేస్తున్నారు. దీంతో విసిగి వేసారి పోయిన లబ్ధిదారులు రేషన్‌ను వదులు కుంటున్నారు. ఆదాయాన్ని రుచి మరిగిన డీలర్లు, వాహన దారులు అక్రమాలకు ఒడిగడుతున్నారు. ఇదే వాహనాల్లో బియ్యం అక్రమ రవాణా చేస్తున్న ఘటనలు అనేకం వెలుగుచూస్తున్నాయి.

సిగ్నల్ సమస్య పేరుతో నాటకాలు

రేషన్ డోర్ డెలివరీ, ఎగవేతల విషయంలో లబ్ధిదారులు, వాహనదారులకు మధ్య తరచుగా వివాదాలు జరుగుతున్నాయి. వాహనం ఎక్కడో నిలబెట్టి అక్కడికి రమ్మనడంపై అనేకమంది వాహనదారులను నిలదీస్తున్నారు. ఈ పోస్ మిషన్‌కు సిగ్నల్ రావడం లేదని, అందువల్లే వీధిలో ఒకచోట వాహనాన్ని ఆపి అక్కడికి రమ్మంటున్నామని చెప్పి తప్పించుకుంటున్నారు.

ఆలపాడు సర్పంచ్
వైసీపీకి రాజీనామా



చుండూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఆల పాడు సర్పంచ్ గద్దె విజ యలక్ష్మి వైసీపీకి రాజీ నామా చేసినట్లు శుక్ర వారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు తమ రాజీనామా పత్రాలను వైసీపీ నాయకులకు పంపినట్లు తెలిపారు. వైసీపీ పాలనలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అంతా తానై ప్రజాభిప్రాయానికి విలువ లేకుండా ఏకపక్షంగా పాలన సాగిందని, దీనివలన గ్రామీణ పాలన వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైందని ఆరోపించారు. పంచాయతీ నిధులను దారి మళ్లించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారన్నారు. గ్రామాల అభివృద్ధికి వారు ఎంతో తోడ్పడుతున్నారన్నారు. అందువలన ఆమె తన భర్త బోడియ్య, కార్యకర్తలతో కలిసి జనసేన పార్టీలో చేరుతున్నట్లు విజయలక్ష్మి తెలిపారు.

చిన్న పరిశ్రమలను ఆదుకోవాలి

- మంత్రి టీజీ భరత్‌కు చాంబర్ అధ్యక్షుడు యేల్చూరి విజ్ఞప్తి



మంత్రి టీజీ భరత్‌ను సత్కరిస్తున్న యేల్చూరి, వెచ్చా తదితరులు

గుంటూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ప్రభుత్వపరంగా సహాయ సహకారాలు అందించాలని ఆదుకోవాలని ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు యేల్చూరి వెంకటేశ్వర్లు పరిశ్రమల శాఖమంత్రి టీజీ భరత్‌ను కోరారు. శుక్రవారం ఆయన వెలగపూడి సచివాలయంలో మంత్రిని కలిసి శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. వ్యాపారుల సమస్యలను చర్చించటంతోపాటు ప్రభుత్వపరంగా పరిశ్రమలకు అందాల్సిన బకాయిలను గురించి మంత్రి దృష్టికి తీసుకెళ్ళారు. ఇటీవల చాంబర్ ఎన్నికల్లో విజయం సాధించిన యేల్చూరిని మంత్రి టీజీ భరత్ అభినందించారు. కార్యక్రమంలో వెచ్చా కృష్ణమూర్తి, సీఏ సుబ్బారాయుడు, దేవంకి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు ప్రజల ఉన్నతి
చంద్రబాబుతోనే సాధ్యం

- మాజీ ఎంపీ రాయపాటి సాంబశివరావు

గుంటూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజల ఉన్నతి సీఎం చంద్రబాబుతోనే సాధ్యమని మాజీ ఎంపీ రాయపాటి సాంబశివరావు ప్రశంసించారు. మాజీ ఎంపీ రాయపాటి సాంబశివరావు, తన సోదరుడు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్‌తో కలిసి ఉండవల్లిలోని నివాసంలో శుక్రవారం సీఎం చంద్రబాబును కలుసుకున్నారు. రాష్ట్రాన్ని ఆర్థిక పురోగమన దిశగా నడుపుతున్నారంటూ చంద్రబాబుకు రాయపాటి అభినందనలు తెలిపారు. జగన్ మోహనరెడ్డి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని విమర్శించారు. చంద్రబాబుకు తమ అభిమానులు, కుటుంబ మద్దతు ఎల్లప్పుడు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా రాయపాటి ఆరోగ్య పరిస్థితులను చంద్రబాబు అడిగి తెలుసుకొన్నారు.



సీఎం చంద్రబాబుకు అభినందనలు తెలియజేస్తున్న రాయపాటి సాంబశివరావు, పక్కన మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ శ్రీనివాస్

రైల్వే ట్రాక్‌ల సమీపంలో పతంగులు ఎగురవేయొద్దు

- ప్రాణం మీదికి తెచ్చుకోవద్దు..
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని ట్రాక్‌ల వద్ద విద్యుదీకరణ పూర్తి
- సంక్రాంతి పండుగ నేపథ్యంలో యువతకు డీఆర్ఎం ఎం రామకృష్ణ హెచ్చరిక

గుంటూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగకు జిల్లా వ్యాప్తంగా పతంగులు (గాలిపటాలు) ఎగురవేయడం తరతరాలుగా వస్తున్నది. అయితే అప్పట్లో రైల్వేట్రాక్‌లు విద్యుద్దీకరణ జరిగి ఉండలేదు. ఇప్పుడు ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా అన్ని రైలుమార్గాలు విద్యుద్దీకరణ పూర్తి అయి ఉన్న దృష్ట్యా వాటికి సమీపంలో గాలిపటాలు ఎగురవేయడం అత్యంత ప్రమాదకరం. మనిషి ప్రాణాన్ని కూడా బలి తీసుకొనే అవకాశం ఉందని గుంటూరు రైల్వే డీఆర్ఎం ఎం రామకృష్ణ తెలిపారు. రైలుమార్గాల పైన ఉండే ఎలక్ట్రిక్ ట్రాక్షన్ తీగెలలో 25వేల వోల్టుల కరెంట్ నిరంతరం సరఫరా జరుగుతుంటుంది. ఈ నేపథ్యంలో వాటికి సమీపంలోకి వెళ్లినా మనిషి మాడి మసైపోయే ప్రమాదం పొంచి ఉంటుంది. అలానే పతంగులకు కట్టేది దారమే కదా... అందులో విద్యుత్ సరఫరా జరగదని భావించడానికి వీల్లేదు. వాటి ద్వారా కూడా విద్యుత్ సరఫరా జరిగి షాక్ కొట్టే అవకాశం ఉందని డీఆర్ఎం తెలిపారు. విద్యుత్ స్తంభాల వద్దకు ఎట్టి పరిస్థితుల్లో వెళ్లొద్దని సూచించారు. ఈ విషయంలో పెద్దలు తమ పిల్లలకు తగిన జాగ్రత్తలు చెప్పి నివారించాలని విజ్ఞప్తి చేశారు. ఎక్కడైనా పొరపాటున విద్యుత్ తీగెలకు గాలిపటాలు, దారం వేలాడుతుంటే సమీపంలోని రైల్వేస్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు. స్వంతంగా తీసే ప్రయత్నం చేయొద్దని సూచించారు. కాగా గతంలో రెడ్డిపాలెం గూడ్స్ షెడ్డు సమీపంలో ఇలానే ఒక చిన్న పిల్లవాడు గాలిపటం ఎగురవేస్తూ షాక్‌కు గురై ప్రాణాలు విడిచాడు.

మరోవైపు గాలిపట్టాలను ఎక్కడైనా మైదానాల్లోనే ఎగుర వేసుకొంటే ఎవ్వరికి ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఇంటి మిద్దెల పైనుంచి పతంగులు ఎగుర వేసి దారాలకు మాంజా పూస్తుంటారు. అవి తెగి ఎగురుతూ రోడ్లపైకి వస్తుంటాయి. ఆ సమయంలో మాంజా దారం కనిపించక ప్రాణాలు పోగొట్టుకొన్న సంఘటన కూడా సంగడిగుంటలో జరిగింది. ఇక గాయాలైన సంఘటనలు కూడా జిల్లాలో అనేకం ఉన్నాయి. దీని దృష్ట్యా రైల్వే ట్రాకుల సమీపంలో పతంగులు ఎగుర వేయొద్దని డీఆర్ఎం రామకృష్ణ యువకులను హెచ్చరించారు.

రాజధానిలో ఇళ్ల స్థలాల కేటాయింపును
వేగంగా పూర్తి చేయండి

సీఎం చంద్రబాబుకు సచివాలయ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మురళీకృష్ణ, రామకృష్ణ వినతి

అమరావతి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రాజధానిలో అమరావతి సచివాలయం, అసెంబ్లీ, రాజ్‌భవన్ ఉద్యోగులకు ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మురళీ కృష్ణ, రామకృష్ణలు సీఎం చంద్రబాబును కలిసి విజ్ఞప్తి చేశారు. సీఎంను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అపరిష్కృతంగా ఉన్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. వారి విజ్ఞప్తిపై సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించి త్వరలో ఒక నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. 12వ వేతన సవరణ కమిషన్‌ను 1-7-2023 నుంచి అమలు చేయడానికి సంబంధించి, వేతన సవరణ కమిషన్ చైర్మన్‌ను నియమించి మధ్యంతర భృతిని అమలు చేయాలని సచివాలయ ఎస్‌వోల సంఘం రంగస్వామి సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. సచివాలయ సంఘం మాజీ అధ్యక్ష, కార్యదర్శులు మురళీకృష్ణ, రామకృష్ణలతో కలిసి సీఎంను కలిసి ఉద్యోగుల సమస్యలపై సీఎంకు వినతిపత్రం అందజేశారు. సీపీఎస్ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిల చెల్లింపు, సీపీఎస్ ఉద్యోగుల వాటా, ప్రభుత్వం సమానంగా ఇవ్వవలసిన దానితోపాటు నిరంతరం జమ చేయాలని కోరారు. జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ, సరెండర్ లీవ్, లోన్లు అడ్వాన్స్‌లు, రిటైర్మెంట్ ప్రయోజనాలు మొదలైనవి సీఎఫ్ఎంఎస్‌లో పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లింపు వెంటనే చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న డియర్‌నెస్ అలవెన్స్ విడతలు విడుదల చేయాలని కోరారు. సీపీఎస్ పథకాన్ని రద్దు చేసి సీపీఎస్ ఉద్యోగులకు పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలని కోరారు. సెక్షన్ ఆఫీసర్ నుంచి అసిస్టెంట్ సెక్రటరీ పోస్టులకు రెగ్యులర్ ప్రమోషన్లను, న్యాయ సంబంధిత సమస్యలను పరిష్కరించచి అమలు చేయాలని, సచివాలయ ఉద్యోగుల సహకార క్యాంటిన్‌కు తగిన మరమ్మత్తులకు అనుమతి ఇవ్వాలని సీఎంకు విన్నవించారు.

---

108 ఉద్యోగులకు ఊరట



- జీతాలు పెంచేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం
- ఒక్కో ఉద్యోగికి అదనంగా రూ. 4 వేలు
- హర్షం వ్యక్తం చేస్తున్న సిబ్బంది

పెదకూరపాడు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఎక్కడ ఏ ప్రమాదం జరిగినా, ఏ అనారోగ్య సమస్య తలెత్తినా ప్రాణాపాయ స్థితి వచ్చినా అందరికీ మొదటిగా గుర్తుచ్చేది 108. సంవత్సరాల తరబడి 108 సిబ్బంది వేతనాలు పెంచాలని కోరినప్పటికీ ఉపయోగం లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే 108 సిబ్బందికి శుభవార్త చెప్పింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 108 సిబ్బందికి వేతనాలు పెంచుతూ నిర్ణయం తీసుకోవటంతో ఒక్కో ఉద్యోగికి నెలకు రూ.4 వేలు చొప్పున జీతం పెరగనుంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో 108 సిబ్బంది వేతనాలు పెంచాలని ప్రభుత్వం ఎంతో ఒత్తిడి తెచ్చినా, ఎన్నో వినతి పత్రాలు ఇచ్చినా వారు స్పందించలేదు. ఎన్నికల సమయంలో 108 ఉద్యోగులు తమ వేతనాలను పెంచాలని చంద్రబాబు నాయుడుకు, కూటమి నేతలకు అప్పట్లో వినతి పత్రాలు అందజేశారు. 108 సిబ్బంది సమస్యలపై సానుకూలంగా స్పందిస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చారు. ఆ హామీని నిలబెట్టుకుంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకోవటంతో 108 ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ఎంతో సంతోషంగా ఉంది..

- వడ్డె ఆనంద్, 108 డ్రైవర్



108 సిబ్బంది జీతాలు పెంచేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకోవటం సంతోషంగా ఉంది. ప్రభుత్వం 108 సిబ్బంది కష్టాలను, ఇబ్బందులను గుర్తించింది. అందుకే వేతనాలు పెంచేందుకు నిర్ణయం తీసుకుంది. నూతన సంవత్సరంతో మా కుటుంబాల్లో వెలుగులు నింపారు. జీతాలు పెంచినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు కృతజ్ఞతలు.

ఫోన్ వచ్చిన వెంటనే వెళ్తాం..

- తుడుము వెంకటరావు, 109 ఈఎంటీ



ప్రమాదం జరిగిందనే విషయంపై ఫోన్ వచ్చిన వెంటనే వెళ్లి అంబులెన్స్‌లో ఎక్కించుకొని ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం ఆస్పత్రికి తీసుకువెళ్తాం. పెదకూరపాడు నియోజకవర్గంలో ప్రతి మండల కేంద్రంలో 108 అంబులెన్స్ అందుబాటులో ఉంది. ఆ మండలానికి సంబంధం లేకపోయినా ఆ సమయంలో 108 వేరే ప్రాంతానికి వెళ్లినా, మరో మండలం నుంచైనా 108 సిబ్బంది వచ్చి ప్రమాదంలో ఉన్నవారిని తీసుకు వెళ్తారు. కూటమి ప్రభుత్వం మా ఇబ్బందులను గుర్తించి వేతనం పెంచటం ఎంతో ఆనందంగా ఉంది.



మండల సర్వసభ్య సమావేశంలో ప్రగతి నివేదికను చదువుతున్న అధికారి

గ్రామాలలో శరవేగంగా సీసీ రోడ్డు నిర్మాణ పనులు

● మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీడీవో

బల్లికురవ. జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఉపాధి హామీ కింద మంజూరు చేసిన నిధులతో గ్రామాలలో శర వేగంగా సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణ పనులు జరుగుతున్నాయని ఎంపీడీవో కె. కుసుమకుమారి తెలిపారు. శుక్రవారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ శ్రీలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా అన్ని శాఖల అధికారులు ప్రభుత్వం ద్వారా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ప్రగతి నివేదికను చదివి వినిపించారు. తహసీల్దార్ రవి నాయక్ మాట్లాడుతూ గ్రామాలలో భూ సమస్యలపై రెవెన్యూ సదస్సులు జరుగుతున్నాయని, రైతులు ఇచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ సభ్యురాలు చింతల అంజలి, మండల కోఆప్షన్ సభ్యులు శ్రీనువలి, పలు శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అనధికారిక లేఅవుట్ల నిర్వాహకులపై కఠిన చర్యలు

వేటపాలెం(చీరాల), జనవరి 3(ఆంధ్రజ్యోతి) :ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాదారులు, అనధికారిక లేఅవుట్ల నిర్వాహకులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని, అందుకు అనుగుణంగా క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది పారదర్శకంగా చర్యలు చేపట్టాలని ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం తహసీల్దార్ పార్వతి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే జీవీ ముసలయ్య, డీటీ శ్రీకాంత్, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లతో ఆర్డీవో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనధికారిక లేఅవుట్లకు సంబంధించి వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా వినియోగించేందుక అవసరమైన చలానా రుసుము చెల్లించి తగిన ధ్రువీకరణ పత్రాలు పొందేవిధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాను అరికట్టేందుకు చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నేత్రదానం

అద్దంకిటౌన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో శుక్రవారం నేత్ర దానం నిర్వహించారు. పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో నివాసం ఉండే కొలిశెట్టి మల్లికార్జునరావు(77) మృతి చెందగా వారి కుటుంబ సభ్యుల సహకారంతో శంకర కంటి వైద్యశాలకు చెందిన వైద్యులు డాక్టర్ చింతల్ బృందం కార్నియాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, సందిరెడ్డి శ్రీనివాసరావు, కాకర్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించకుంటే చర్యలు

పంగులూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) :విధి నిర్వహణలో సిబ్బంది సమయపాలన పాటించాలని ఎంపీఈవో స్వరూపారాణి హెచ్చరించారు. మండలంలోని ముప్పవరం సచివాలయాన్ని శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ప్రజలకు అందిస్తున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు.ఈవోఆర్డీ సుమంత్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివయ్య, సర్పంచ్ రౌతు సాంబశివరావు, కార్యదర్శి జానీ బేగం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

పంగులూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) :మినరల్ వాటర్ ప్లాంట్ల నిర్వహణలో ప్రభుత్వ నిబంధనలు విధిగా పాటించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివయ్య అన్నారు. మండలంలోని ముప్పవరం గ్రామంలో శుక్రవారం మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏఈ పరిశీలించారు. కొత్తగా మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలంటే పంచాయతీ అనుమతి తప్పనిసరిగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ సుమంత్, కార్యదర్శి జానీబేగం, సురేంద్ర, అనంతలక్ష్మి, ఆదాం సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

పాత ఎంపీడీవో కార్యాలయంలో దొంగలు హల్‌చల్

ఇంకొల్లు,జనవరి 3,(ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు పాత ఎంపీడీవో కార్యాలయంలో దొంగలు పడి కొన్ని వస్తువులను అపహరించుకు పోయారు. భవనం శిథిలావస్థకు చేరుకొంది. దర్వాజాలు, కిటికీలు చెదలుపట్టి పూర్తిగా దెబ్బతిన్నాయి.దీంతో చిల్లర దొంగలు హల్‌చల్ చేస్తున్నారు.తలుపులు పగులగొట్టి అందులో విలువైన రికార్డులు తీసుకుపోతున్నారు.సీలింగు ఫ్యాన్లు సైతం అపహరణకు గురైయ్యాయి.సంబంధిత అధికారులు దీనిపై దృష్టి సారించాల్సి ఉంది.

మత్తుకు అలవాటుపడి..

● గంజాయి దొరక్క బోనోఫిక్స్‌కు బానిసలుగా దంపతులు

● అదిదొరక్క భర్తపై భార్యదాడి

● అడ్డువచ్చిన ఆరేళ్ల కూతురునీ బాదేసిన వైనం

చీరాలటౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) :స్థానిక రామనగర్‌లో ఓ భార్యాభర్త గంజాయికి బానిసలు. అయితే ప్రస్తుతం గంజాయి దొరక్కపోవడంతో బోనోఫిక్స్‌కు అలవాటుపడ్డారు. నిత్యం కలిసి మెలిసి పీల్చేవారు. అయితే ఇటీవల కాలంలో భర్త ఒక్కడే బయటకు వెళ్లి బోనోఫిక్స్ పీల్చుకుని ఇంటికి వస్తున్నాడు. అయితే బానిసగా మారిన భార్య తనకు మత్తు ఇవ్వడం లేదని భర్తపై గురువారం దాడిచేసింది. దీంతో పరస్పరం దాడులకు తెగబడ్డారు. కన్నుమిన్ను కానకుండా దాడులు చేసుకున్నారు. ఆసమయంలో అమాయకురాలైన ఆరేళ్ల కుమార్తె వీరికి డ్డు వచ్చింది. దీంతో పైశాచికంగా కుర్చీతో ఘోరంగా దాడి చేశారు. దీంతో అభం శుభం తెలియని చిన్నారి తలపూర్తిగా రక్త స్రావం అయి స్పృహ కోల్పోయింది. హుటాహుటిన వారే ఆ చిన్నారిని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. బోనోఫిక్స్ మత్తులో ఊగిసలాడుతున్న ఇటువంటి బానిసలకు పోలీసు యంత్రాంగం అడ్డుకట్ట వేయాల్సి ఉంది. లేకుంటే భవిష్యత్తులో ఎటువంటి ఘోరాలు చవిచూడాల్సి వస్తుందోనని ప్రజలు భీతిల్లుతున్నారు. అలాగే బోనోఫిక్స్ అమ్మకాలు జరిపేందుకు దుకాణ దారులకు కచ్చితమైన ఆదేశాలు ఇవ్వాల్సి ఉంది.

పొగాకు రైతుల సంక్షేమం కోసమే బోర్డు ఏర్పాటు : ఆర్ఎం

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పొగాకు రైతుల సంక్షేమం కోసమే బోర్డు ఏర్పాటు జరిగిందని రీజనల్ మేనేజర్ బుల్లి సుబ్బారావు తెలిపారు. ఒంగోలులోని పొగాకు బోర్డు కార్యాలయంలో శుక్రవారం 49వ పొగాకు బోర్డు వ్యవస్థాపక దినోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ ఎలాంటి విపత్తులు ఎదురైనా పొగాకు బోర్డు రైతులకు అండగా ఉంటుందన్నారు. బోర్డు ద్వారా రైతుల కోసం చేపడుతున్నత కార్యక్రమాలను వివరించారు. అనంతరం పలువురు పొగాకు రైతులు మాట్లాడుతూ సీటీఆర్ఐ సహకారంతో ఆధునాతన పరికరాలు అందుబాటులోకి తీసుకువచ్చి పొగాకు సాగును సులభతరం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

సావిత్రిబాయి పూలేని ఆదర్శంగా తీసుకోవాలి

అద్దంకిటౌన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు సావిత్రిబాయి పూలేని ఆదర్శంగా తీసుకుని విద్యలో ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రిన్సిపాల్ డాక్టర్ వి. మోహనరావు అన్నారు. స్థానిక కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సాయిత్రిబాయి పూలే జయంతి, జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ అనిత, డాక్టర్ షర్మిలంరాణి, డాక్టర్ సుశీల, విద్యార్థులు పాల్గొన్నారు.



పందిళ్లపల్లి జడ్‌పీహెచ్‌ఎస్‌లో సావిత్రిబాయి పూలేకు నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు

ఐక్య వేదిక ఆధ్వర్యంలో ..

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్య వేదిక ఆధ్వర్యంలో సాయిత్రిబాయి పూలే 194వ జయంతిని స్థానిక గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ గాయత్రిదేవి అధ్యక్షన ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలలో విజేతలకు నగదు బహుమతులను అందించారు. పాఠశాలలోని 26 మంది మహిళా ఉపాధ్యాయులను శాలువలు, మెమొంటోలతో ఘనంగా సత్కరించారు. ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు జ్యోతి రమేష్‌బాబు, రిటైర్డ్ ఆర్‌జేడీ డాక్టర్ యు. దేవపాలన, రిటైర్డ్ హెచ్‌ఎం సీహెచ్. రామాంజనేయులు, అన్నమనేని వెంకట్రావు, జ్యోతి చంద్రమౌళి, ఐక్య వేదిక ప్రధాన కార్యదర్శి జ్యోతి శ్రీమన్నారాయణ మూర్తి, ట్రెజరర్ సీహెచ్ నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చినగంజాంలో

చినగంజాం : మండలంలోని మున్నంవారిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి హెచ్‌ఎం మల్లారెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయురాలు పి.హిమవంతేశ్వరిని హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.నాగమల్లేశ్వరరావు, ఎస్.చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

మార్టూరులో

మార్టూరు : సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను శుక్రవారం మండలంలోని వలపర్ల గ్రామంలోని నేతాజీ విద్యాసంస్థలో ఘనంగా నిర్వహించారు విద్యాసంస్థలో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయినులను శాలువాకప్పి హెచ్‌ఎం షాహిరా ఘనంగా సత్కరించారు.



సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ మోహనరావు, అధ్యాపకులు

క్విజ్ పోటీలలో పందిళ్లపల్లి విద్యార్థుల ప్రతిభ

వేటపాలెం(చీరాల) : బాపట్లలో సైన్స్ ఫెయిర్‌లో భాగంగా శుక్రవారం నిర్వహించిన క్విజ్ పోటీలలో వేటపాలెం మండలం పందిళ్లపల్లి జెడ్‌పీహెచ్ఎస్ విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచి ప్రతిభను చాటారు. 7వ తరగతి చదువుతున్న పింజల నిఖిలేష్‌కుమార్(ప్రథమ స్థానం), పృథ్వి షణ్ముఖేశ్వర్(ద్వితీయ స్థానం)లో నిలిచారు. వారికి ప్రశంసాపత్రాలు, షీల్డ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా పందిళ్లపల్లి స్కూల్ ఉపాధ్యాయులు, సహ విద్యార్థులు, ఎస్ఎంసీ చైర్మన్, సభ్యులు, గ్రామస్థులు విద్యార్థులను అభినందించారు.

నిర్ణీత కాలవ్యవధిలో సమస్యలకు పరిష్కారం

ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

వేటపాలెం(చీరాల), జనవరి 3(ఆంధ్రజ్యోతి) : నిర్ణీత కాలవ్యవధిలో అర్జీదారుల సమస్యలు పరిష్కరించేందుకు అన్ని చర్యలు చేపడతామని ఆర్డీవో చంద్రశేఖర్‌నాయడు చెప్పారు. మండల పరిధిలోని పాపాయిపాలెంలో శుక్రవారం తహసీల్దార్ పార్వతి అధ్యక్షతన నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆర్డీవో ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మొత్తం 14 అర్జీలు వివిధ సమస్యలపై అందాయి. అందులో పట్టాదారు పాసుపుస్తకాల కోసం 10, కుల ధ్రువీకరణ కోసం 2, ఎఫ్‌లైన్ కోసం 2 అర్జీలు అందాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



పాపాయిపాలెంలో అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

ఇంకొల్లులో

ఇంకొల్లు : మండలంలోని భీమవరంలో జరిగిన రెవెన్యూ సదస్సులో నాలుగు అర్జీలు అందాయని తహసీల్దారు వెంకటరత్నం తెలిపారు. ఒకటి దేవదాయ భూములను సర్వే చేయాలని, భూ సమస్యల పరిష్కారానికి మరో మూడు అర్జీలు అందాయన్నారు.



కశ్యాపురంలో జరిగిన రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ సింగారావు

పంగులూరులో..

పంగులూరు :రెవెన్యూ సదస్సుల ద్వారా రైతులు తమ భూ సమస్యలు పరిష్కరించుకోవాలని మండల తహసీల్దార్ సింగారావు కోరారు. కశ్యాపురం గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

సమస్యను కోర్టుకు నివేదిస్తాం

మండలంలోని అలవలపాడు గ్రామంలో 175 సర్వే నెంబరులో గల భూ వివాదంపై కోర్టుకు తగిన నివేదికను సమర్పిస్తామని తహసీల్దార్ సింగారావు రైతులకు తెలిపారు. కోర్టువారు కోరిన సమాచార నిమిత్తం భూమిపై తగిన సర్వే శుక్రవారం నిర్వహించారు.

బైబిల్ పరీక్షలో విజేతలకు బహుమతులు

చినగంజాం, జనవరి 3(ఆంధ్రజ్యోతి) :క్రిస్మస్, నూతన సంవత్సరం సందర్భంగా ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయి బైబిల్ పరీక్షలో విజేతలైన వారికి స్థానిక అంబేడ్కర్‌నగర్‌లోని పెద్ద చర్చి వద్ద శుక్రవారం నిర్వహించిన సభలో బహుమతులు అందజేశారు. క్రిస్మస్ క్యారల్స్ నిర్వాహకులు మేకల మేషక్‌బాబు అధ్యక్షతన జరిగిన సభలో బైబిల్ పరీక్షలో ప్రథమ స్థానం సాధించిన కడవకుదురు గ్రామానికి చెందిన కత్తి సుమంత్‌కు సత్యం హైస్కూల్ డైరెక్టర్ ఎన్. హరనాథ్‌బాబు సమకూర్చిన రూ.11వేల రూపాయిలను, రెండవ బహుమతి పొందిన అంబేడ్కర్‌నగర్‌కు చెందిన బడుగు రిబ్కాకు ఉపాధ్యాయుడు సురేంద్ర, బ్యాంకు ఉద్యోగి అందజేసిన రూ.8 వేల రూపాయలను, మూడవ స్థానంలో నిలిచిన తొట్టెంపూడి లుదియాకు బడుగు శ్రీనివాసరావు జ్ఞాపకార్థం ఆయన కుమార్తె శోభారాణి అందజేసిన ఐదు వేలరూపాయలను, కడవకుదురు గ్రామానికి చెందిన డి.ఏలియా నాలుగవ స్థానం సాధించగా పాదర్తి ఆనందబాబు అందజేసిన మూడు వేల రూపాయలను, టీ.వజ్రం, జే.దయమ్మ, పీ.దీనలు ఐదో స్థానాలు సాధించగా రైల్వే ఉద్యోగి చప్పిడి చక్రపాణి, ఎం.రామస్వామిలు అందజేసిన బహుమతులను అందించారు. అనంతరం ఇటీవల ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన బడుగు అబ్రహాంలింకన్, మేడికొండ కోటేశ్వరరావులను గ్రామ పెద్దలు, అంబేద్కర్ యూత్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ గ్రామ పెద్దలు, ఎంప్లాయీస్ అసోసియేషన్ సభ్యులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

నాటి భూబాగోతాలపై నిగ్గు తేల్చండి

బాధితులకు న్యాయం చేయండి

రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక సమావేశంలో ఎమ్మెల్యేల విజ్ఞప్తి

మార్చి నాటికి పరిష్కరించాలని మంత్రి సత్యప్రసాద్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

ఉమ్మడి జిల్లాలో గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన భూదందాలు, ఆక్రమణలపై నిగ్గు తేల్చి బాధితులకు న్యాయం చేయాలని టీడీపీ శాసనసభ్యులు, ఇన్‌చార్జిలు డిమాండ్ చేశారు. శుక్రవారం మంగళగిరిలో రెవెన్యూ శాఖ మంత్రి సత్యప్రసాద్ అధ్యక్షత జరిగిన ప్రత్యేక సమావేశంలో జిల్లాకు చెందిన శాసనసభ్యులు పాల్గొని పలు అంశాలను ప్రస్తావించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా నాలుగు జిల్లాలకు ఒక ప్రత్యేక సమావేశాన్ని రెవెన్యూ శాఖ నిర్వహిస్తోంది. మంత్రి సత్యప్రసాద్‌తోపాటు రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులంతా శుక్రవారం సమావేశంలో పాల్గొన్నారు. జిల్లా నుంచి కలెక్టర్, జాయింట్ కలెక్టర్, టీడీపీ ఎమ్మెల్యేలతోపాటు ఇద్దరు ఇన్‌చార్జిలు హాజరయ్యారు. ఆయా నియోజకవర్గాల వారీ రెవెన్యూ సమస్యలను ఎమ్మెల్యేలు ప్రధానంగా ప్రస్తావించారు. ముఖ్యంగా గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన భూఆక్రమణలపై విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యేలు ప్రస్తావించిన సమస్యలు ఇవీ..

తొలుత కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి మాట్లాడుతూ కనిగిరి నియోజకవర్గంలో జరిగిన అనేక భూ ఆక్రమణల గురించి సమావేశం దృష్టికి తీసుకెళ్లారు. సీఎస్‌పురం మండలం రేగులచిలక గ్రామంలో 400 ఎకరాల భూ ఆక్రమణ జరిగితే దానిపై గత ప్రభుత్వం నిష్పక్షపాత విచారణ చేయించకపోగా సీఎస్‌పురంలోని మొత్తం భూములపై నిషేధం విధించడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. హెచ్ఎంపాడు మండలం టీవీపల్లి, అగ్రహారం, హెచ్ఎంపాడు ప్రాంతాల్లో 200 ఎకరాల ప్రభుత్వ భూమిని వైసీపీ ప్రభుత్వంలో పంపిణీ చేయగా 1,500 ఎకరాలను నియోజకవర్గేతరులకు కేటాయించి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. దీనిపై విచారణ చేయించాలని కోరారు. వెలిగండ్ల, సీఎస్‌పురం మండలాల్లో రెవెన్యూ సమస్యలను ప్రస్తావిస్తే మా వద్ద రికార్డులు లేవంటూ అధికారులు తప్పుకుంటున్నారని.. విచారణ చేయించి అసలు అవి ఉన్నాయో, లేవో తేల్చాలని కోరారు.

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో మార్కాపురం ప్రాంతంలో జరిగిన భూ ఆక్రమణలకు సంబంధించి 35 రికార్డులపై విచారణ చేయించాల్సిన అవసరం ఉందని చెప్పారు. అప్పట్లో ప్రభుత్వం అధికారులను బలి చేస్తూ అనేక మందిని సస్పెండ్ చేసిందే తప్ప ఆక్రమణలకు పాల్పడిన వారి నుంచి భూములు వెనక్కు తీసుకోలేదన్నారు. ఆ భూబాగోతాలపై తిరిగి విచారణ చేయించాలని కోరారు. భూములను ఆన్‌లైన్‌లో ఎక్కించాలన్నా, తొలగించాలన్నా అధికారాన్ని జాయింట్ కలెక్టర్ల పరిధిలో ఉండటంతో ఇబ్బందులు కలుగుతున్నాయన్న ఆయన.. ఆర్డీవో పరిధిలోకి తేవాలని కోరారు.

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఒంగోలులో జరిగిన అనేక అక్రమాలపై తిరిగి విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. అప్పట్లో నిరుపేదలకు ఇంటి స్థలాల కేటాయింపులోనూ అక్రమాలు చోటు చేసుకున్నాయన్నారు. అనర్హులకు స్థలాలను కట్టబెట్టారని, ప్రత్యేక విచారణ చేయించి న్యాయం చేయాలని కోరారు.

సమావేశంలో పాల్గొన్న విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆ రెండు నియోజకవర్గాల్లో ఉన్న ఇనాం భూముల సమస్యలను ప్రస్తావించారు. ప్రధానంగా ఎనిమిది గ్రామాల పరిధిలో ఉన్న సమస్యలను వివరిస్తూ తక్షణమే రైతులకు రిజిస్ట్రేషన్‌లు జరిగేలే చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే పూర్తి హక్కులు ఉన్నప్పటికీ దేవదాయ భూముల పేరుతో ప్రైవేట్ భూముల రిజిస్ట్రేషన్లు నిలిపారని చెప్పారు. ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరారు. వాన్‌పిక్ పేరుతో ఆ పరిధిలో లేని భూములపై రైతుల హక్కులు ఆపేశారని వాటిని పునరుద్ధరించాలని కోరారు. మరో మంత్రి స్వామి విశాఖ పర్యటనలో ఉన్నందున సమావేశానికి హాజరుకాలేదు. దీంతో రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ సత్య కొండపి నియోజకవర్గంలోని పలు రెవెన్యూ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డితోపాటు దర్శి, ఎర్రగొండపాలెం నియోజకవర్గాల టీడీపీ ఇన్‌చార్జులు గొట్టిపాటి లక్ష్మి, ఎరిక్షన్‌బాబు వారి నియోజకవర్గాల్లోని సమస్యలను వివరించారు. వీటన్నింటినీ వచ్చే మార్చిలోపు పరిష్కరించాలని, మార్చి చివర్లో ఇదే తరహా సమావేశం నిర్వహిస్తామని మంత్రి సత్యప్రసాద్ రాష్ట్ర, జిల్లా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.



ఎయిర్‌పోర్టులపై సమీక్ష చేస్తున్న చంద్రబాబు నాయుడు

ఒంగోలులో ఎయిర్‌పోర్టుపై అధ్యయనాన్ని వెంటనే పూర్తి చేయాలి

● సీఎం చంద్రబాబు ఆదేశం

ఒంగోలు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు సమీపంలో ప్రతిపాదించిన ఎయిర్ పోర్టు సాధ్యాసాధ్యాలపై చేపట్టిన అధ్యయనాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఎయిర్ పోర్టుల అభివృద్ధిపై ముఖ్యమంత్రి శుక్రవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఏడు ఎయిర్ పోర్టులు ఉండగా మరో ఏడింటి ఏర్పాటుకు ప్రతిపాదనలు ఉన్నాయి. ఉన్న ఎయిర్‌పోర్టులలో అభివృద్ధి చేయాల్సిన అంశాలు, కొత్తగా ప్రతిపాదించిన వాటి ప్రస్తుత పరిస్థితిని అధికారులను సీఎం అడిగి తెలుసుకున్నారు. ఆ సందర్భంగా ఒంగోలు ఎయిర్‌పోర్టు అంశంపై సమీక్షలో 657 ఎకరాల భూమి సిద్ధంగా ఉన్నట్లు అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. అక్కడ ఎయిర్ పోర్టు ఏర్పాటుకు ఉన్న అవకాశాలపై అధ్యయనం జరుగుతున్నట్లు చెప్పారు. దానిపై స్పందించిన సీఎం చంద్రబాబు త్వరితగతిన దాన్ని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

రాష్ట్రస్థాయికి ఆరు ప్రాజెక్టులు ఎంపిక

ఒంగోలు విద్య, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులో శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. స్థానిక ఒంగోలు పబ్లిక్ స్కూలులో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనను జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో విజ్ఞాన శాస్త్రం పట్ల అభిలాషను పెంచాలన్నారు. విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించి నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించాలని కోరారు. విద్యార్థుల్లో ఆరోగ్యకరమైన పోటీని ప్రోత్సహించి వారి ఉన్నతికి ఉపాధ్యాయులు మార్గదర్శకులు కావాలని కోరారు. విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను తిలకించిన డీఈవో వారిని అభినందించారు. 38 మండలాల నుంచి మండలానికి మూడు చొప్పున 114 ప్రాజెక్టులు రావాల్సి ఉండగా 87 మాత్రమే ప్రదర్శించారు. మండల స్థాయిలో ఎంపికైన ప్రాజెక్టులు జిల్లా స్థాయిప్రదర్శనకు తీసుకురాని వారికి, మండల స్థాయిలో అసలు ప్రదర్శనలను నిర్వహించని వారికి మెమోలు జారీ చేస్తున్నట్లు డీఈవో తెలిపారు. ప్రదర్శనలో ఆరు ఉత్తమ ప్రాజెక్టులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన 18 మందికి డీఈవో సర్టిఫికెట్లను అందజేశారు.

విజేతలు వీరే

వ్యక్తిగత, సామూహిక, టీచర్ ఎగ్జిబిట్లలో ఆరింటిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. వ్యక్తిగత విభాగంలో మంగమూరు జడ్పీ హైస్కూలు విద్యార్థి పి.దివ్యశ్రీ (లిజునిలన్ మెషిన్), మార్కాపురం జడ్పీ బాలికల హైస్కూలు విద్యార్థి శ్రీలక్ష్మి కామేశ్వరి (స్మార్ట్ పోల్), గ్రూపు ఎగ్జిబిట్‌లో చిన్నారికట్ల విద్యార్థులు ఎం.సాయి, బి.వీరేంద్ర (పెన్షింగ్ ఆఫ్ హ్యూమనిటి), తమ్ములచెరువు హైస్కూలు విద్యార్థులు ఈశ్వరరెడ్డి, ఎం.శ్రీను(స్కాలర్‌షిప్) ప్రాజెక్టులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. టీచర్ ఎగ్జిబిట్‌లో పొదిలి జీహెచ్‌ఎస్ టీచర్ ఎ.మధుసూదనరావు (స్మార్ట్ ప్యాన్ మైక్రో స్కోప్), ఈదుమూడి హైస్కూలు టీచర్ కె.స్వర్ణలత (జాబిల్లి జిలుగులు) ప్రాజెక్టులు రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికయ్యాయి. వ్యక్తిగత విభాగంలో ద్వితీయ స్థానంలో ఇద్దరు, తృతీయ స్థానంలో ఇద్దరిని విజేతలుగా ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఉప విద్యాధికారి చంద్రమౌళీశ్వర్, ఒంగోలు ఎంఈవో కిషోర్‌బాబు, డీసీఈబీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు సైన్స్ అధికారి టి.రమేష్, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.



నియోజకవర్గాలకు పంపేందుకు ఓటర్ల జాబితాలను పరిశీలిస్తున్న సిబ్బంది

6న ఓటర్ల తుది జాబితా

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈనెల 6వతేదీన ఓటర్ల తుది జాబితాను ప్రచురించనున్నారు. అందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. నాలుగు నెలల క్రితం ఓటర్ల జాబితా సవరణకు ఎన్నికల కమిషన్ ఆదేశించింది. తదనుగుణంగా కలెక్టర్ తమీమ్ అన్సారియా నేతృత్వంలో నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల పర్యవేక్షణలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను చేపట్టారు. చేర్పులు, మార్పులు చేశారు. ఈనెల 6వతేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లోని సీపీవో కార్యాలయ ఆవరణలో ఆయా నియోజకవర్గాల సిబ్బంది జాబితాలను తమ ప్రాంతాలకు తీసుకెళ్లేందుకు పరిశీలన చేపట్టారు. పోలింగ్ కేంద్రాల వారీగా ప్రత్యేక వాహనాల్లో నియోజకవర్గాలకు తరలించనున్నారు. ఆర్వో తుది ఓటర్ల జాబితాను ప్రకటించనున్నారు.

యువతికి కుట్టుమిషన్ పంపిణీ

మార్టూరు,జనవరి3(ఆంధ్రజ్యోతి):స్థానికంగా అమ్మ ఆశ్రమంలో టైలరింగ్‌లో శిక్షణ పొందిన పేద యువతి షేక్ ముబీనా బేగంకు శుక్రవారం ఇన్నర్ వీల్ క్లబ్ వారు కుట్టుమిషన్‌ను ఉచితంగా అందజేశారు.ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు హబీజాన్, కార్యదర్శి వసంత శ్రీదేవి, మాజీ అధ్యక్షురాలు జాష్టి అనూరాధ ఆశ్రమం అధ్యక్షులు గుంటుపల్లి చందు తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ



పందిళ్లపల్లిలో గ్రామ నడక కార్యక్రమంలో కూటమి నాయకులు

సమస్యల పరిష్కారం కోసం గ్రామనడక

వేటపాలెం(చీరాల), జనవరి 3(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పందిళ్లపల్లిలో గ్రామనడక పేరుతో శుక్రవారం కూటమికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు గ్రామంలో పర్యటించారు. గ్రామ సచివాలయం - 1 నుంచి గ్రామనడక కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తాము పర్యటించిన పరిధిలోని వీధులలో సమస్యలను అక్కడివారిని అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామన్నారు. అలానే మన హక్కులతో పాటు బాధ్యతలను గుర్తెరిగి స్వీయనియంత్రణతో ప్రభుత్వానికి సహకరించాల్సిన ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు పి. బాలచంద్ర, ఆర్.కె నాయుడు, పి. శ్రీనివాసరావు, కె. బాలసుబ్రమణ్యం, వై. బసవేశ్వరరావు, లలిత్‌కుమార్, లోకేష్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సన్మానం అందుకున్న విశ్రాంత ఉద్యోగులు

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి

ఇంకొల్లు,జనవరి 3,(ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తానని ప్రభుత్వ విశ్రాంత ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావుల బాపయ్య అన్నారు. శుక్రవారం ఇంకొల్లు శాఖ ఆధ్వర్యంలో పెన్షనర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా 75 సంవత్సరాలు దాటిన 21 మంది పెన్షనర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇంకొల్లు శాఖ అధ్యక్ష కార్యదర్శులు వై.కృష్ణమూర్తి,కరి కమలేశ్వరరావు, చీరాల ఉపఖజానా అధికారి మద్ది వెంకట సుబ్బారావు, మార్టూరు అధ్యక్ష కార్యదర్శులు కమాలుద్దీన్, చిట్టిబాబు, అద్దంకి అధ్యక్ష కార్యదర్శులు మస్తాన్,కృష్ణయ్య, గోపాలరావు, హరిబాబు, బ్రహ్మానాయుడు, ఆంధ్రప్రగతి బ్యాంకు మేనేజరు శేషయ్య, 150 మంది పెన్షనర్లు పాల్గొన్నారు.




ర్యాలీ నిర్వహిస్తున్న విశ్వ హిందూపరిషత్ ప్రతినిధులు

దేవాలయాల పవిత్రతను కాపాడాలి

● విశ్వ హిందూపరిషత్ చీరాల శాఖ ప్రతినిధులు

చీరాలటౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : హిందూ దేవాలయాల పవిత్రకు భంగం కలిగేలా ప్రస్తుత పరిస్థితులు ఉన్నాయని, ఈక్రమంలో పాలకులు వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని చీరాల విశ్వ హిందూపరిషత్ శాఖ ప్రతినిధులు అన్నారు. వచ్చే ఆదివారం విజయవాడలో హైందవ శంఖారావం బహిరంగ సభ జరుగుతున్న నేపథ్యంలో చీరాలలో బైక్ ర్యాలీ నిర్వహించారు. బోస్‌నగర్‌లోని శ్రీవీరాంజనేయ స్వామి దేవస్థానం నుంచి ప్రారంభమైన ర్యాలీ చీరాల, పేరాల, ఈపూరుపాలెం ప్రాంతాల్లో జరిగింది. ర్యాలీలో పెద్ద సంఖ్యలో హిందువులు పాల్గొన్నారు. ఎండోమెంట్‌ను తొలగించి ధార్మిక సంస్థలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. విజయవాడ సభకు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు.



వాలీబాల్ పోటీలలో విజేతలతో సెయింట్‌ఆన్స్ కళాశాల ప్రతినిధులు

వాలీబాల్ పోటీలలో సెయింట్ ఆన్స్ కళాశాల జట్టు ప్రతిభ

చీరాల, జనవరి 3(ఆంధ్రజ్యోతి) : జాతీయస్థాయిలో గుంటూరు ఆర్‌వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో ఇటీవల జరిగిన వాలీబాల్ పోటీలలో తమ కళాశాల జట్టు విన్నర్స్‌గా నిలిచిందని కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావులు తెలిపారు. కళాశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో క్రీడాకారులను వారు అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. జగదీష్ బాబు మాట్లాడుతూ ఆర్‌వీఆర్ అండ్ జేసీలో జరిగిన పోటీలలో 20 జట్లతో ఆడి అంతిమంగా విన్నర్స్‌గా నిలిచారన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు అన్నం శ్రీనివాసరావు, అడ్మినిస్ట్రేటివ్ మేనేజరు ఆర్‌వీ రమణమూర్తి, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

9 నుంచి కొమ్మినేనివారిపాలెంలో క్రికెట్ పోటీలు

బల్లికురవ. జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొమ్మినేనివారిపాలెం గ్రామంలో నూతన సంవత్సరం, సంక్రాంతి సందర్భంగా గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 9 నుంచి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలు జరుగుతాయని నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. ఈ పోటీలలో విజేతలకు మొదటి బహుమతిగా రూ.25,116, రెండో బహుమతిగా రూ. 20,116, మూడో బహుమతిగా రూ.15,116 అందజేస్తామని, మ్యాన్ ఆఫ్‌ది సిరీస్‌కు రూ.3,116 చొప్పున అందజేస్తామని, ఎంట్రీ ఫీజు రూ.750 చెల్లించాలని కోరారు. ఈనెల 8 వ తేదీన పోటీలకు సంబంధించి డ్రా తీస్తామని, మరిన్ని వివరాలకు 8555834197, 7670949842 నెంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

వ్యర్థాలకు నిప్పు- ప్రాణాలకు ముప్పు

● పాగతో ప్రమాదాల బారిన వాహనదారులు

● పట్టించుకోని అధికారులు





రోడ్డుపక్కన దట్టంగా ఉన్న పాగలో నుంచి వస్తున్న వాహనదారులు (ఇన్‌సెట్లో) రోడ్డు మార్జిన్‌లో పోసిన వ్యర్థాలు

పర్చూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): వ్యర్థాలను తగులబెట్టే సమయంలో వచ్చే పొగ వాహనదారుల ప్రాణాలను తీస్తోంది. పర్చూరు-చీరాల ఆర్‌అండ్‌బీ రోడ్డు మార్జిన్‌లో గ్రామాల్లోని వ్యర్థాలను తెచ్చి పోయటంతో అవి కాస్త డంపింగ్ యార్డుల్లా మారాయి. వ్యర్థాలను తొలగించాల్సిన సిబ్బంది వాటికి నిప్పు అంటించి చేతులు దులుపు కోవటంతో సమస్య జటిలంగా మారింది. తగులబడుతున్న వ్యర్థాల నుంచి వచ్చే పొగ రోడ్డును కమ్మివేయటంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. దట్టమైనపొగతో ఎదురుగా వస్తున్న వాహనాలను గుర్తించలేక ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రస్తుతం పొగ మంచుకూడా తోడు కావటంతో సమస్య మరింత జటిలంగా మారింది. దీనికి తోడు ఇదే రోడ్డులో వాడరేవు - పిడుగురాళ్ళ జాతీయ రహదారి నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. దీంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం చోటుచేసుకుంటుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అలంకార ప్రాయంగా డంపింగ్ యార్డులు

గ్రామాల్లో చెత్త చెదారం కోసం లక్షల రూపాయల వ్యయవంతో ఏర్పాటు చేసిన చెత్త సంపద కేంద్రాలు(డంపింగ్ యార్డ్‌లు) వినియోగంలోకి రాక అలంకార ప్రాయంగా మారాయి. వీటిని వినియోగించేందుకు చర్యలు చేపట్టాల్సిన అధికారులు ఇది తమ పనికాదన్నట్లు వ్యవహరించటంతో పరిస్థితి ఇలా తయారైందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సిలీంద్రాలతోనే శనగకు ఎండు తెగులు

● పంటమార్పిడి, విత్తనశుద్ధి విధిగా పాటించాలి

● వ్యవసాయ శాస్త్రవేత్తల సూచన



చందలూరులో ఎండు తెగులు సోకిన శనగ పైరును పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్ర వేత్తలు

పంగులూరు. జనవరి 3 (ఆంధ్రజ్యోతి) :శనగ పైరులో ఎండు తెగులు గుర్తించామని, భూమిలో సిలీంద్రాల ద్వారా ఈ తెగులు విస్తరించిందని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ కిషోర్‌వర్మ, డాక్టర్ రమేష్ అన్నారు. మండలంలోని చందలూరు గ్రామంలో శనగ పైరుకు ఆశించిన ఎండుతెగులును శుక్రవారం లాఫామ్ శాస్త్రవేత్త డాక్టర్ కిషోర్‌వర్మ, డాక్టర్ సృజినీరావు, కృషీవిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రమేష్‌లు స్థానిక రైతులతో కలసి తెగులు సోకిన శనగ పైరును పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దీర్ఘ కాలంగా భూమిలో ఒకే పైరు సాగు చేయడం వల్ల ఇలాంటి తెగుళ్ల ఆశించే అవకాశం ఉందన్నారు. సాగుకు ముందు విత్తన ఎంపిక, విత్తనశుద్ధి చేయడం అవసరమని సూచించారు. ట్రైకోడెర్మా విరిడీతో పాటు వేపపిండి 100 కిలోల సేంద్రియ ఎరువుతో కలిపి బాగా మగ్గిన అనంతరం దుక్కిలో వేసి దున్నడం వలన సిలీంద్రాలు నశించి పైరుకు మేలు చేస్తుందని శాస్త్ర వేత్తలు రైతులకు సూచించారు. ఈ పరిశీలనలో కె.వి.సుబ్బారావు, రైతులు పెంట్యాల రామలింగస్వామి, ఎర్రమనేని వెంకటరావు, చిట్టిబాబు, హనుమంతరావు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఇంజనీరింగ్ కార్మికులు

మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

● ధర్నాలో సీఐటీయూ నేతల డిమాండ్

చీరాలటౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : చీరాల మునిసిపల్ పరిధిలో పని చేస్తున్న మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ప్రతినిధులు డిమాండ్ చేశారు. శుక్రవారం మునిసిపల్ కార్యాలయ ప్రాంగణంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇంజనీరింగ్ సిబ్బంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు కావడంతో పనికి తగిన వేతనం అందడం లేదన్నారు. సమాన పనికి సమాన వేతనం అందించాలన్నారు. అలాగే వారి సర్వీసును ప్రాధాన్యంగా తీసుకుని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అదనపు పనులకు టీఏ, డీఏలు అందించాలని కోరారు. అనంతరం కమిషనర్ అబ్దుల్ రషీద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఎన్. బాబురావు, చిమటా వీరాస్వామి, చాంద్‌బాషా, నాగేశ్వరరావు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

అద్దంకిలో..

అద్దంకిటౌన్ : ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కారించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని మున్సిపల్ కమిషనర్ రవీంద్రను కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆదాం, ఇంజనీరింగ్ విభాగం అధ్యక్షుడు ఉసురుపాటి సామేలు, ఉపాధ్యక్షుడు పెద్ద మార్కు, కార్యదర్శి వసంతరావు(జాన్), కమిటీ సభ్యులు ఎం. రమాదేవి, ఎం. ప్రేమ్ , వై. అనూష తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీల నిర్మాణానికి శ్రీకారం

ఎమ్మెల్యే ఏలూరి చొరవతో పనులు



పర్చూరులోని చెరువు కట్ట నుంచి హిందూ శ్మశానం మీదుగా నిర్మాణం చేస్తున్న డ్రైనేజీ పనులు

పర్చూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ఏలూరి చొరవతో గ్రామాల్లో డ్రైనేజీల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం గ్రామాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉంది. ఎక్కడ చూసినా మురుగునీరే దర్శనమిస్తోంది. దీనికి ప్రధాన కారణం డ్రైనేజీలు లేకపోవటం, ఉన్న చోట వాటిని ఆక్రమించుకొని కట్టడాలు నిర్మించడంతో సమస్య ఏర్పడుతోంది. ఈ సమస్యపై స్పందించిన ఏలూరి సాంబశివరావు యుద్ధప్రాతిపదికన కాలువల ఏర్పాటుతోపాటు, మురుగునీరు నిల్వ లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. దీంతో పంచాయతీ అధికారులు డ్రైనేజీ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో భాగంగా పర్చూరు చెరువు కట్ట నుంచి హిందూ శ్మశానం మీదుగా డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టారు. ప్రస్తుతం పనులు శరవేగంగా సాగుతున్నాయి.

విపత్తుల సమయంలో జాగ్రత్తలు పాటించాలి

ఈపూరుపాలెం(చీరాలటౌన్), జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి విపత్తుల సమయంలో తగిన జాగ్రత్తలు పాటించడం వలన సులభంగా బయట పడవచ్చని ఎన్‌డీఆర్‌ఎఫ్ కమాండర్ ముఖేష్ అన్నారు. విజయవాడ కార్యాలయం ఆదేశాల మేరకు శుక్రవారం మండల పరిధిలోని ఈపూరుపాలెం బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు ప్రదర్శన ద్వారా పలు సందేహాలను నివృత్తి చేశారు. అలాగే పాఠశాలకు ప్రథమ చికిత్స కిట్, అవగాహన సీడీని అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని సుధావాణి, ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది, బోధన బోధనేతర, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది

శనగల డబ్బులు ఇప్పించండి

తహసీల్దార్‌కు రైతుల వినతి

యద్దనపూడి,(మార్టూరు)జనవరి3(ఆంధ్రజ్యోతి):శనగలు కొనుగోలు చేసిన గోగుల నాగరాజు అనే వ్యక్తి డబ్బులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాడని శుక్రవారం రైతు సంఘం నాయకులు, బాధిత రైతులు తహసీల్దారు రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు.యద్దనపూడి మండలంలోని యద్దనపూడి, పూనూరు, గన్నవరం, చింతపల్లిపాడు గ్రామాలకు చెందిన 14 మంది రైతుల దగ్గర గోగుల నాగరాజు అనే వ్యక్తి శనగలను కొనుగోలు చేశారు.వారందరికీ 1 కోటి 14 లక్షల రూపాయలను ఇవ్వాల్సి ఉండగా నాగరాజు ఇంతవరకు వారికి డబ్బులు ఇవ్వలేదు. పల్నాడు జిల్లా చిలకలూరిపేటకు చెందిన నాగరాజు స్థానిక యలవర్తి కోల్డ్‌స్టోరేజీలో గుమస్తాగా పనిచేసే సమయంలో అతనికి రైతులతో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయాలతో రైతులు అతనికి శనగలను అమ్మారు. ఈ విషయమై తమకు న్యాయం చేయాలని,నాగరాజు నుండి తమకు డబ్బులు ఇప్పించాలని కోరుతూ రైతులు,రైతుసంఘం నాయకులు ఆ వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో బత్తుల హనుమంతరావు, గొట్టిపాటి రాంబాబు,పెరవల్లి శ్రీనివాసరావు,కర్లపూడి సుబ్బారావు,తదితరులు పాల్గొన్నారు.

గోపి కుటుంబసభ్యులను పరామర్శించిన మంత్రి గొట్టిపాటి

అద్దంకి,జనవరి3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధేనువకొండలో ఇటీవల మృతి చెందిన మండల తెలుగు యువత అధ్యక్షుడు జొన్నలగడ్డ గోపి కుటుంబసభ్యులను మంత్రి గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం పరామర్శించారు. గోపి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అలాగే టీడీపీ నేతలు నాగినేని రామకృష్ణ, కరి పరమేష్, కరారి నాగేశ్వరరావు, చాగంటి రాజేంద్ర ప్రసాద్, బండారుపల్లి శ్రీనివాసరావు, మలాది నటరాజ్, అన్నాబత్తిన అజయ్‌బాబు, రంగా, రమణ, అంజయ్య తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

నేడు మంత్రి పర్యటన వివరాలు

విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ శనివారం అద్దంకి నియోజకవర్గంలో పలు కార్యక్రమాలలో పాల్గొననున్నారు. ఉదయం 10.30 గంటలకు బల్లికురవ మండలం ఎస్ఎల్ గుడిపాడు, 11.30 గంటలకు సంతమాగులూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల, మధ్యాహ్నం 12 గంటలకు సంతమాగులూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగే రెవెన్యూ సదస్సులకు మంత్రి రవికుమార్ హాజరు కానున్నారు.

పలువురిని పరామర్శించిన రవికుమార్

మేదరమెట్ల, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని పి. గుడిపాడులో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కుటుంబాలను రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పరామర్శించారు. శుక్రవారం పి. గుడిపాడులో అనారోగ్యంతో మృతి చెందిన రావూరి సందీప్ ఇంటికి వెళ్లి సందీప్ తల్లి స్వరూపను పరామర్శించారు. అనారోగ్యానికి గల కారణాలను అడిగి తెలుసుకుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. పలతోటి అంజయ్య అనారోగ్యంతో మృతి చెందగా వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట గ్రామ తెలుగుదేశం నాయకులు మందా నాగేశ్వరరావు, తొట్టే రవీంద్ర, మందా ఆమోస్‌తో పాటు తెలుగుదేశం నాయకులు ఉన్నారు.

నేడు మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం

బల్లికురవ. జనవరి 3 (ఆంధ్రజ్యోతి) :ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో శనివారం నుంచి మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వం ప్రారంభిస్తున్నదని బల్లికురవ కళాశాల ప్రిన్సిపాల్ కె. సుధాకర్ తెలిపారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం సమయంలో ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ప్రిన్సిపాల్ తెలిపారు.



మహిళా కానిస్టేబుల్‌ను సేవారత్న అవార్డుతో సత్కరిస్తున్న సీఐ బండారు సురేష్

జై జపాలి ట్రస్ట్ సేవలు అభినందనీయం

● టీడీపీ సీనియర్ నేత సీతారామయ్య

ఆదిపూడి(పర్చూరు), జనవరి 3(ఆంధ్రజ్యోతి) : జై జపాలి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా గ్రామాభివృద్ధితోపాటు, ప్రజలకు సేవ చేయటం అభినందనీయమని టీడీపీ సీనియర్ నేత, కాపుసంఘం నాయకులు ఉగ్గిరాల సీతారామయ్య అన్నారు. కారంచేడు మండలం ఆదిపూడి గ్రామంలోని పార్కులో ఏర్పాటు చేసిన బుద్ధుని విగ్రహ ప్రారంభోత్సవ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సీతారామయ్య మాట్లాడుతూ ప్రభుత్వంతోపాటు, ప్రజల సహకారం ఉంటే గ్రామాభివృద్ధి సాధ్యమన్నారు. పల్నాడు జిల్లా నర్సరావుపేట స్పెషల్ బ్రాంచ్ సీఐ బండారు సురేష్ మాట్లాడుతూ ట్రస్ట్ ద్వారా గ్రామంలోని శ్మశాన వాటిక అభివృద్ధితో పాటు,పార్కును కూడా ఏర్పాటు చేశామన్నారు. దీంతోపాటు, నిరుపేద విద్యార్థులకు ఆర్థిక చేయూత నందించి వారి ఉజ్వల భవిష్యత్‌కు జై జపాలి చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు. అనంతరం గుంటూరు జిల్లా, పెదకాకాని పోలీస్ స్టేషన్‌లో మహిళా కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ స్వచ్ఛందంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న కృష్ణకుమారిని సేవారత్న బిరుదుతో ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో ట్రస్ట్ ఛైర్మన్ బండారు వెంకటేశ్వర్లు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ రమణారావు,హరిదాసుల మాధవరావు, కాసా శ్రీనివాసరావు, శ్రీనివాసరావు, కాల్వ రఘురామయ్య తదితరులు పాల్గొన్నారు.



మృతుడి కుటుంబసభ్యులతో సాంఘిక సంక్షేమ అధికారి రాజ దెబోరా, పలు మండలాల వెల్ఫేర్ అసిస్టెంట్‌లు

వెల్ఫేర్ అసిస్టెంట్ కుటుంబానికి ఆర్థిక సాయం

చినగంజాం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొనసపూడి గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పని చేస్తూ గుండెపోటుతో మృతిచెందిన ఆసోది నరేంద్రబాబు కుటుంబాన్ని శుక్రవారం సాంఘిక సంక్షేమ శాఖాధికారి రాజ దెబోరా పరామర్శించారు. జిల్లా పరిధిలోని వెల్ఫేర్ అసిస్టెంట్‌లు అందజేసిన ఆర్థిక సాయం రూ.64,400లను ఆమె నరేంద్రబాబు కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సుబ్బారావు, చీరాల, రేపల్లె ఏఎస్‌డబ్ల్యూవోలు సైదారెడ్డి, సత్యనారాయణ, హెచ్‌డబ్ల్యూవో, వెల్ఫేర్ రాష్ట్ర కమిటీ సభ్యులు శ్రీనివాస్, చినగంజాం, పలు మండలాలకు చెందిన వెల్ఫేర్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పంగులూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని భగవాన్‌రాజుపాలెం ఫ్లై ఓవర్ దిగువన జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా పలువురికి గాయాలయ్యాయి. పోలీసులు అందించిన సమాచారం మేరకు ఒంగోలు వైపు నుంచి చిలకలూరిపేట వైపు వెళుతున్న మారుతీ జన్ కారు ముందు వెళుతున్న లారీని ఓవర్ టేక్ చేసే క్రమంలో అదే వరుసలో ముందు వెళుతున్న ఆటోతో పాటు స్కూటర్‌ను వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో స్కూటీపై ప్రయాణిస్తున్న బొమ్మనంపాడు గ్రామానికి చెందిన కస్తూరి నాగేశ్వరరావు కారు టైరు కిందపడి మృతిచెందాడు. కారు వేగంగా ఢీకొనడంతో ఆటో తిరగబడటంతో అందులో పంగులూరు నుంచి మార్టూరు కూరగాయల మార్కెట్‌కి వెళుతున్న పొన్నం శ్రీనివాసరావుకు కాలు విరిగింది. బేతాల పెదేడుకొండలు, నందవరపు పీరు సాహెబ్, పెదమస్తాన్, శ్రావణం మస్తానమ్మలకు గాయాలయ్యాయి. ఎస్ఐ వినోద్‌బాబు గాయపడిన వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో మార్టూరుకు,కాలు విరిగిన శ్రీనివాసరావును నరసరావుపేట వైద్యశాలకు తరలించారు. నాగేశ్వరరావు (70) మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రేణంగివరం ఎస్ఐ. వినోద్‌బాబు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలునుంచి జారిపడి వ్యక్తి దుర్మరణం

చీరాలటౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : తిరుమల శ్రీవేంకటేశ్వరుని దర్శించుకుని ఇంటికి వెళుతూ ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి రాజమండ్రి జిల్లా సీతానగరం మండలం బొబ్బర్లంకకు చెందిన తన్నీరు శ్రీనివాసరావు(54) దుర్మరణం చెందాడు. చినగంజాం మండలం కడవకుదురు వద్ద గురువారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. చీరాల రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని శుక్రవారం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుని వద్ద లభించిన సెల్‌ఫోన్ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశారు. శనివారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించనున్నారు.

కారు ఢీకొని యువకుడి మృతి

మేదరమెట్ల, జనవరి 3(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిలో అత్యవసర రన్‌వేపై మోపెడ్‌పై వెళ్తున్న యువకుడిని కారు ఢీకొంది.ఈ ప్రమాదంలో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. శుక్రవారం ఉదయం జె. పంగులూరు మండలం రేణింగివరంకు చెందిన అన్నపురెడ్డి హరికృష్ణ (29) మోపెడ్‌పై రేణంగివరం వెళ్తున్న క్రమంలో వెనుక నుంచి కారు ఢీ కొంది. ఈ ప్రమాదంలో హరికృష్ణ మృతి చెందాడు. మేదరమెట్ల ఎస్ఐ షేక్ మహమ్మద్ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైకు పై నుంచి పడి ఒకరికి తీవ్రగాయాలు

బల్లికురవ. జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కొమ్మినేనివారిపాలెం అద్దంకి మేజర్ కాలువ బ్రిడ్జి వద్ద బైకు అదుపు తప్పి పడిపోయింది. ఈప్రమాదంలో శంకరవరప్పాడుకు చెందిన హనుమంతురావు అనే వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. అద్దంకి మండలం శంకవరప్పాడుకు చెందిన హనుమంతురావు బల్లికురవ మండలం కొమ్మినేనివారిపాలెంకు శుక్రవారం బైకుపై వస్తుండగా అద్దంకి మేజర్ కాలవ బ్రిడ్జి వద్దకు వచ్చే సరికి బైకు అదుపు తప్పి పడింది. ఈప్రమాదంలో తీవ్రంగా గాయపడిన హనుమంతురావును 108లో చికిత్స నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఇసుక ట్రాక్టరు పట్టివేత

వేటపాలెం(చీరాల), జనవరి 3(ఆంధ్రజ్యోతి) : ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టరును శుక్రవారం వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు పట్టుకున్నారు. ఆ ట్రాక్టరును ఇసుకతో సహా స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.